ప్రజావీక్షణం దినపత్రిక
విలేకర్లు కావలెను
అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ విలువలతో కూడిన జీవన శైలిలో
ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ
ప్రజల పక్షాన నిలబడాలని అనుకుంటున్నారా.?
బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా.?
అయితే రండి.. అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..
తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా
జిల్లాలు, మండలాల వారీగా నిబద్ధతతో
పని చేసే విలేకరులు కావలెను
PJV ప్రజా వీక్షణం టీవి
9866330400


# ప్రజావీక్షణం

దినపత్రిక

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

PJV ప్రజా వీక్షణం టీవి

Subscribe

www.prajaveekshanam.in | సంపుటి:16 | సంచిక :291 | 14 సోమవారం సెప్టెంబర్ 2026 | పేజీలు : 08 | వెల:రూ.2/-

Published from : Vijayawada, Krishna, Guntur, Kakinada, Vishakhapatnam, Vijayanagaram, Prakasham, Kadapa, Kurnool, Tirupathi, Anantapur, East Godavari, West Godavari


### ఘనంగా ఖైరతాబాద్ గణనాథుడి ఆవిష్కరణ..

## తొలి పూజ...



- ఖైరతాబాద్‌లో కొలువుదీరిన 69 అడుగుల మహాగణపతి
- పంచముఖ సంకటహర రూపంలో దర్శనమిస్తున్న గణనాథుడు
- మట్టితో పర్యావరణ హితంగా విగ్రహం నిర్మాణం
- సోమవారం గవర్నర్ చేతుల మీదుగా తొలి పూజ
- ఆదివారం నుంచే దర్శనానికి పోటెత్తిన భక్తజనం

భాగ్యనగరంలో వినాయక చవితి ఉత్సవాల సందడి అప్పుడే మొదలైంది. ప్రసిద్ధ ఖైరతాబాద్ మహాగణపతి విగ్రహాన్ని నిర్వాహకులు ఆదివారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ ఏడాది 72వ ఉత్సవాల్లో భాగంగా 69 అడుగుల ఎత్తుతో 'పంచముఖ సంకటహర మహాగణపతి' రూపంలో గణనాథుడు కొలువుదీరాడు. విగ్రహాన్ని ఆవిష్కరించిన వెంటనే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దర్శించుకోవడం ప్రారంభించారు. ఈసారి స్వామివారు ఐదు ముఖాలు, ఐదు పడగల సర్పం, బహుళ హస్తాలతో సంకటాలను హరించే రూపంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. గణపతికి ఒకవైపు 15 అడుగుల సోమనాథ జ్యోతిర్లింగం, మరోవైపు కాళికామాత విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. పర్యావరణ హితంగా రూపుదిద్దుకున్న ఈ విగ్రహ నిర్మాణంలో సుమారు 30 టన్నుల నదీ మట్టి (రాజస్థాన్ బనాస్ నది నుంచి), 20 టన్నుల ఇసుక, 25 టన్నులకు పైగా స్టీల్‌తో పాటు గడ్డి, సేంద్రియ రంగులను ఉపయోగించారు. ప్రఖ్యాత శిల్పి చిన్నస్వామి రాజేంద్రన్ పర్యవేక్షణలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు చెందిన 150 మందికి పైగా కళాకారులు మూడు నెలల పాటు శ్రమించి ఈ భారీ విగ్రహాన్ని రూపొందించారు. గత జూన్‌లో కర్రపూజతో పనులు ప్రారంభమయ్యాయి. ...మిగతా 2 లో...

## మోదీ మారథాన్ దౌత్యం..

### రెండున్నర రోజుల్లో 15 భేటీలు!

**ఢిల్లీలో విజయవంతంగా ముగిసిన 18వ బ్రిక్స్ సదస్సు**



- సదస్సుతో పాటు 15 భేటీల్లో పాల్గొన్న ప్రధాని మోదీ
- రష్యా, చైనా అధ్యక్షులతో పాటు పలువురు ప్రపంచ నేతలతో చర్చలు
- మూడు రోజుల పాటు విరామం లేకుండా కొనసాగిన సమావేశాలు
- భారత్ దౌత్యపరమైన క్రియాశీలతకు నిదర్శనంగా నిలిచిన సదస్సు

"ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దౌత్యపరంగా తనదైన శైలిని, అలుపెరగని శక్తిని మరోసారి ప్రదర్శించారు. ఢిల్లీలోని భారత్ మండపం వేదికగా విజయవంతంగా ముగిసిన 18వ బ్రిక్స్ సదస్సు, ఆయన నిబద్ధతకు అద్దం పట్టింది. శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు కేవలం రెండున్నర రోజుల వ్యవధిలో, ప్రధాని మోదీ ఏకంగా 15 ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించి తన దౌత్య వేగాన్ని చాటుకున్నారు.ఈ అధికారిక సమావేశాలే కాకుండా, బ్రిక్స్ సదస్సు సెషన్లు, ఔట్‌రీచ్ సమావేశాల మధ్యలో పలువురు ప్రపంచ నేతలు, అంతర్జాతీయ సంస్థల అధిపతులతో కూడా ఆయన అనేక పుల్-అసైడ్ (అనధికారిక) సమావేశాల్లో పాల్గొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో చర్చలతో ప్రధాని మోదీ ఈ దౌత్య మారథాన్‌ను ప్రారంభించారు. అదే రోజు సాయంత్రం ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్, ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్‌లతో వేర్వేరుగా భేటీ అయ్యారు.శనివారం ఉదయం హైదరాబాద్ హౌస్‌లో ఇథియోపియా ప్రధాని అబియ్ అహ్మద్ అలీతో చర్చలతో రోజును ప్రారంభించిన మోదీ, ఆ తర్వాత మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం, అబుదాబి క్రౌన్ ప్రిన్స్ షేక్ ఖలీద్ బిన్ మహమ్మద్, వియత్నాం ప్రధాని లే మిన్ హంగ్‌లతో వరుసగా సమావేశమయ్యారు. అనంతరం బ్రిక్స్ సదస్సులో పాల్గొని, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో కీలక ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. సదస్సులో భాగంగా 'భారత్ ఇన్నోవేట్స్' ఎగ్జిబిషన్‌ను తిలకించడం, నేతలతో కలిసి మొక్కలు నాటడం వంటి కార్యక్రమాల్లోనూ పాల్గొన్నారు.ఆదివారం కూడా ప్రధాని సమావేశాల పరంపర ఆగలేదు. బ్రిక్స్ భాగస్వామ్య, ఔట్‌రీచ్ దేశాల నేతలతో భేటీ అనంతరం, కజకిస్థాన్ ప్రధాని, ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు, ఈజిప్ట్ అధ్యక్షుడు, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు, బురుండి అధ్యక్షుడు, నైజీరియా ఉపాధ్యక్షుడు, ఉగాండా ఉపాధ్యక్షురాలితో ఒకరి తర్వాత ఒకరితో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. మొత్తం మీద, బ్రిక్స్ సదస్సు వేదికగా ప్రధాని మోదీ చూపిన చొరవ, ఆయన జరిపిన వరుస సమావేశాలు ప్రపంచ దేశాలతో సంబంధాలను బలోపేతం చేయాలన్న భారత్ సంకల్పాన్ని మరోసారి స్పష్టం చేశాయి."



## ముగిసిన 18వ బ్రిక్స్ సదస్సు..

### ప్రపంచ నేతలకు ధన్యవాదాలు తెలిపిన ప్రధాని మోదీ

- న్యూఢిల్లీలో విజయవంతంగా 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు
- సహకారంతోనే సవాళ్లను ఎదుర్కోవాలని సభ్య దేశాలకు ప్రధాని మోదీ పిలుపు
- తదుపరి బ్రిక్స్ సదస్సుకు చైనా ఆతిథ్యం ఇవ్వనున్నట్లు ప్రకటన

భవిష్యత్ కార్యాచరణకు దిశానిర్దేశం చేసే న్యూఢిల్లీ డిక్లరేషన్‌కు కూటమి ఆమోదం న్యూఢిల్లీ వేదికగా జరిగిన 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు విజయవంతంగా ముగిసింది. ముగింపు సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించారు. సదస్సుకు హాజరైన సభ్య దేశాల అధినేతలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. తదుపరి బ్రిక్స్ సదస్సుకు చైనా ఆతిథ్యం ఇవ్వనుండటంతో, ఆ దేశానికి ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించి, సమ్మిళిత అభివృద్ధిని సాధించడానికి బ్రిక్స్ దేశాల మధ్య పరస్పర సహకారం అత్యంత కీలకమని నొక్కి చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న భౌగోళిక, రాజకీయ ఘర్షణల వల్ల సామాన్య ప్రజలు తీవ్రంగా ప్రభావితమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆధునిక సాంకేతికత, కీలకమైన ఖనిజాలను కొన్ని శక్తులు ఆయుధాలుగా మార్చుకోవడంపై ఆయన తీవ్ర ఆందోళన వెలిబుచ్చారు. ...మిగతా 2 లో...

## తెలంగాణ ధనిక రాష్ట్రం...

### అది రోశయ్య చలవే: సీఎం రేవంత్ రెడ్డి



- తెలంగాణ మిగులు బడ్జెట్‌కు రోశయ్య ముందుచూపే కారణమన్న రేవంత్ రెడ్డి
- రోశయ్యకు కాంగ్రెస్ పార్టీ సముచిత గౌరవం ఇచ్చిందని వెల్లడి
- తన ఎదుగుదలకు రోశయ్య సలహా ఇచ్చారని గుర్తుచేసుకున్న సీఎం
- హైదరాబాద్‌లో రోశయ్య విగ్రహ ఏర్పాటును సమర్థించిన రేవంత్
- ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన నిర్మాణానికి ప్రభుత్వ సాయం

తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు రూ.16,000 కోట్ల మిగులు బడ్జెట్‌తో ఆవిర్భవించిందంటే, ఆ ఘనత పూర్తిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్యకే దక్కుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఆదివారం ఉప్పల్ భగాయత్‌లో ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. రోశయ్య ముందుచూపు వల్లే 2014 జూన్ 2న తెలంగాణ ధనిక రాష్ట్రంగా ఏర్పడిందని స్పష్టం చేశారు.ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన రోశయ్యకు కాంగ్రెస్ పార్టీ సముచిత గౌరవం ఇచ్చిందని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చెన్నారెడ్డి, విజయభాస్కర రెడ్డి, వై.ఎస్. రాజశేఖర రెడ్డి వంటి ముఖ్యమంత్రులు రాష్ట్ర ఖజానా బాధ్యతలను ఆర్యవైశ్యులకే అప్పగించారని తెలిపారు. రోశయ్య అత్యధిక కాలం ఆర్థిక మంత్రిగా పనిచేసి, 16 సార్లు రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఘనతను స్మరించుకున్నారు. ...మిగతా 2 లో...

### ఆశ్రమ పాఠశాల విద్యార్థిని గర్భం దాల్చిన ఘటన..

## హెచ్‌ఎం సహా ముగ్గురిపై వేటు

- పోలవరం జిల్లా ఆశ్రమ పాఠశాలలో గర్భం దాల్చిన బాలిక
- ప్రభుత్వం సీరియస్.. ముగ్గురు సిబ్బందిపై సస్పెన్షన్
- హెచ్‌ఎం, వార్డెన్, టీచర్‌ను సస్పెండ్ చేసిన సర్కార్
- బాలికను గర్భవతి చేసిన వంట మనిషిపై పోక్సో కేసు




పోలవరం జిల్లా అడ్డతీగల మండలంలోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థిని గర్భం దాల్చిన ఘటనపై ఏపీ ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలితో సహా ముగ్గురు సిబ్బందిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఘటనపై గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ (డీడీ) రుక్మాండయ్య వివరాలు వెల్లడించారు. పాఠశాల హెచ్‌ఎం దూడ శాంతమతి, హాస్టల్ వార్డెన్ పల్లాల విజయగంధం, తరగతి ఉపాధ్యాయురాలు కాకూరి లోవమ్మలను సస్పెండ్ చేసినట్లు ఆయన తెలిపారు. సిబ్బంది పర్యవేక్షణ లోపం కారణంగానే ఈ దురదృష్టకర సంఘటన జరిగిందని ప్రాథమికంగా గుర్తించినట్లు చెప్పారు. ...మిగతా 2 లో...

### మంత్రి పదవి పోయిందన్న

## బాధ లేదు.. కానీ!

- తాను కాంగ్రెస్ పార్టీని వీడుతున్నానన్న ప్రచారాన్ని కొట్టిపారేసిన కొండా సురేఖ
- మంత్రి పదవి పోయినందుకు బాధ లేదు, కానీ కారణం చెప్పకపోవడమే ఆవేదన కలిగించింది
- భవిష్యత్తులోనూ కాంగ్రెస్ టికెట్‌పైనే పోటీ చేస్తామని స్పష్టం చేసిన కొండా దంపతులు
- స్థానిక నేతలపై పరోక్షంగా విమర్శలు గుప్పించిన మాజీ మంత్రి



త్వరలో తన భర్త కొండా మురళికి పదవి వస్తుందన్న సంకేతాలు ఉన్నాయని వెల్లడి తాను కాంగ్రెస్ పార్టీని వీడుతున్నట్టుగా కొన్ని రోజులుగా జరుగుతున్న ప్రచారానికి మాజీ మంత్రి, కాంగ్రెస్ ఎమ్మెల్యే కొండా సురేఖ ఫుల్ స్టాప్ పెట్టారు. ఆ వార్తలన్నీ నిరాధారమైనవని, కేవలం కల్పిత కథనాలని ఆమె కొట్టిపారేశారు. తన భర్త కొండా మురళితో కలిసి ఆదివారం వరంగల్‌లో పార్టీ కార్యకర్తలు, మద్దతు దారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్‌ను వీడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ...మిగతా 2 లో...

పాఠకులకు ప్రకటన కర్తలకు
శ్రేయోభిలాషులకు
అధికారులకు అనధికారులకు
ప్రజా ప్రతినిధులకు మరియు
సిబ్బందికి
వినాయక చవితి
శుభాకాంక్షలు
నేడు కార్యాలయానికి సెలవు
మంగళవారం పత్రిక వెలువడదు
పునర్దర్శనం బుధవారం



ప్రజావీక్షణం దినపత్రిక
ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్
ఇట్లు... పత్రిక యాజమాన్యం

ప్రజావీక్షణం
దినపత్రిక

# మంత్రి పదవి పోయిందన్న బాధ లేదు.. కానీ!

మొదటిపేజీ తరువాయి

"మేము కాంగ్రెస్‌లోనే పుట్టాం, కాంగ్రెస్‌లోనే పెరిగాం. మాకు వేరే పార్టీలోకి వెళ్లాలనే ఆలోచన లేదు" అని కొండా సురేఖ తేల్చిచెప్పారు. గతంలో కొన్ని తప్పనిసరి పరిస్థితుల్లో బీఆర్ఎస్‌లోకి వెళ్లాల్సి వచ్చిందని అన్నారు. తమను ఎవరూ బయటకు పంపలేదని గుర్తుచేశారు. భవిష్యత్తులో జరిగే అన్ని ఎన్నికల్లోనూ కాంగ్రెస్ టికెట్‌పైనే పోటీ చేస్తామని ఆమె ధీమా వ్యక్తం చేశారు. మంత్రివర్గం నుంచి తనను తొలగించడంపై మాట్లాడుతూ.. పదవి పోయినందుకు వ్యక్తిగతంగా ఎలాంటి బాధ లేదని, కానీ ఎందుకు తొలగించారో కారణం చెప్పకపోవడం ఆవేదన కలిగించిందని అన్నారు. మంత్రి పదవి ఒక అలంకారం మాత్రమేనని, తనకు అప్పగించిన మూడు శాఖలను ఎలాంటి అవినీతికి తావులేకుండా నడిపించానని తెలిపారు. పార్టీ మార్పు ప్రచారం నేపథ్యంలో అధిష్ఠానం నుంచి తనకు ఫోన్లు వచ్చాయని, తాను పార్టీ వీడటం లేదని వారికి స్పష్టం చేశానని సురేఖ వెల్లడించారు. ఈ క్రమంలో తన భర్త కొండా మురళికి త్వరలో పదవి ఇస్తామనే సంకేతాలు కూడా అధిష్ఠానం నుంచి వచ్చాయని ఆమె తెలిపారు. రానున్న ఎన్నికల్లో వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరపున మళ్లీ గెలిచి, మంత్రిగా తిరిగి వస్తానని విశ్వాసం వ్యక్తం చేశారు. త్వరలో జరగనున్న వరంగల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 24 నుంచి 25 డివిజన్లలో కాంగ్రెస్‌ను గెలిపించడమే తమ లక్ష్యమని ప్రకటించారు. ఈ సందర్భంగా స్థానిక నేతలపై ఆమె పరోక్షంగా విమర్శలు గుప్పించారు. కనీసం కార్పొరేటర్‌గా కూడా గెలవలేని వారు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. వైఎస్ఆర్ మరణం తర్వాత స్థానికంగా ఉన్న కొందరు "గుంటనక్కలు" తమను మోసం చేశారని ఆరోపించారు. అప్పటి మంత్రిని ఓడించేందుకే కేసీఆర్ తనకు వరంగల్ తూర్పు టికెట్ ఇచ్చారని గుర్తుచేశారు. తాము పరకాలను వీడిన తర్వాత చల్లా ధర్మారెడ్డి అక్రమంగా డబ్బు సంపాదించారని కూడా సురేఖ ఆరోపణలు చేశారు.

# నాలుగు నెలలుగా జీతాలు లేవు.. ఉద్యోగ భద్రతపై ఆందోళన

-- జలమండలి ఔట్‌సోర్సింగ్ కార్మికుల్లో తీవ్ర ఆవేదన.. ఇద్దరు కార్మికుల మృతి

-- 677 మంది కార్మికుల భవిష్యత్తుపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్.. కిరణ్ మృతితో మరింత ఉధృతమైన ఆందోళన

బోయిన పల్లి; సెప్టెంబర్ 13.(ప్రజా వీక్షణం)

తెలంగాణ రాష్ట్ర జలమండలిలో ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న వందలాది మంది కార్మికుల సమస్యలు తీవ్ర ఆందోళనకు దారితీస్తున్నాయి. సుమారు 677 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు గత నాలుగు నెలలుగా జీతాలు అందకపోవడంతో కుటుంబాలను పోషించుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు తమను రోజువారీ వేతన కార్మికులుగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ప్రచారంతో ఉద్యోగ భద్రతపై కూడా భయాందోళనలు నెలకొన్నాయని వారు చెబుతున్నారు.

### -- జీతాల కోసం కార్యాలయం వద్ద నిరసన.......

నెలల తరబడి జీతాలు అందకపోవడంతో కార్మికులు జలమండలి కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. తమకు రావాల్సిన పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని, ఉద్యోగాల్లో కొనసాగించాలని, భవిష్యత్తుపై స్పష్టత ఇవ్వాలని అధికారులను కోరారు. నాలుగు నెలలుగా జీతాలు లేకపోవడంతో ఇంటి అద్దెలు, పిల్లల చదువులు, నిత్యావసర సరుకులు, వైద్య ఖర్చులు తదితర కనీస అవసరాలను తీర్చుకోవడం కూడా కష్టంగా మారిందని కార్మికులు వాపోతున్నారు. ఆందోళన నేపథ్యంలో అధికారులు కార్మికులతో చర్చించి పెండింగ్ జీతాలు చెల్లిస్తామని హామీ ఇచ్చినప్పటికీ, ఇప్పటివరకు వేతనాలు చెల్లించలేదని కార్మికులు ఆరోపిస్తున్నారు. అధికారుల హామీ అమలు కాకపోవడంతో కార్మికుల్లో అసంతృప్తి మరింత పెరిగింది.

### -- ఉద్యోగం ఉంటుందా.. ఊడుతుందా?

వేతనాల సమస్యకు తోడు తమ ఉద్యోగాల భవిష్యత్తుపై స్పష్టత లేకపోవడం కార్మికులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందని సహచరులు చెబుతున్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రోజువారీ వేతన కార్మికులుగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయనే వార్తలతో తమ కుటుంబాల పరిస్థితి ఏమవుతుందోనని భయపడుతున్నామని పలువురు కార్మికులు పేర్కొంటున్నారు. ఏళ్ల తరబడి జలమండలి సేవల్లో పనిచేస్తున్న తమకు ఒక్కసారిగా ఉద్యోగ భద్రత లేకుండా చేయడం సరికాదని, తమ సేవలను గుర్తించి తగిన రక్షణ కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

### -- ఇద్దరు కార్మికుల మృతితో విషాదం..........



ఇదిలా ఉండగా, కార్మికుల ఆందోళనల మధ్య వరుసగా ఇద్దరు కార్మికులు గుండెపోటుతో మృతి చెందడం విషాదాన్ని నింపింది. శ్రీహరి అనే కార్మికుడు రెండు రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందాడని సహచర కార్మికులు తెలిపారు. తాజాగా కిరణ్ అనే మరో కార్మికుడు నిన్న రాత్రి గుండెపోటుతో మృతి చెందడంతో కార్మికుల్లో తీవ్ర విషాదం నెలకొంది. అయితే వీరి గుండెపోటు మరణాలకు వేతనాలు, ఉద్యోగ భద్రతపై నెలకొన్న ఒత్తిడే కారణమని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది కార్మికుల వాదన మాత్రమేనని, వైద్యపరంగా మరణానికి గల కారణాన్ని సంబంధిత వైద్యులు నిర్ధారించాల్సి ఉంది.

### -- కిరణ్ ఇంటి వద్దకు తరలివస్తున్న కార్మికులు........

కిరణ్ మృతిచెందిన విషయం తెలుసుకున్న సహచర కార్మికులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో ఆయన నివాసం వైపు తరలివస్తున్నారు. తమ సహచరుడి మృతితో ఆవేదనకు గురైన కార్మికులు ప్రభుత్వానికి, జలమండలి ఉన్నతాధికారులకు తమ సమస్యలను మరోసారి తీవ్రంగా తెలియజేయాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారకుండా కిరణ్ నివాసం వద్ద అధికారులు ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

### -- ప్రభుత్వం వెంటనే స్పందించాలన్న డిమాండ్

నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను తక్షణమే చెల్లించాలని, 677 మంది కార్మికుల ఉద్యోగ భద్రతపై స్పష్టమైన ప్రకటన చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. రోజువారీ వేతన కార్మికులుగా మార్చే ప్రయత్నాలను నిలిపివేసి, ప్రస్తుతం కొనసాగుతున్న విధానంలోనే తమ సేవలను కొనసాగించాలని కోరుతున్నారు. జీతాల కోసం నెలల తరబడి ఎదురుచూస్తున్న కార్మికులు.. ఉద్యోగం ఉంటుందో లేదో తెలియని పరిస్థితి.. వరుసగా ఇద్దరు కార్మికుల మృతి.. ఈ పరిణామాల నేపథ్యంలో జలమండలి ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్య ఇప్పుడు మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రభుత్వం, జలమండలి ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకుని కార్మికులతో చర్చలు జరిపి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు. "జీతాలు చెల్లించండి.. ఉద్యోగాలను కాపాడండి.. మా కుటుంబాలకు భరోసా కల్పించండి" అంటూ కార్మికులు చేస్తున్న విజ్ఞప్తిపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాల్సి ఉంది.

# మద్యంలో నీళ్లకు బదులు కూల్ డ్రింక్స్ కలుపుకుని తాగితే ఏమవుతుంది?

మద్యంలో కూల్ డ్రింక్స్, సోడా కలపడంపై వైద్యుల హెచ్చరిక

శీతల పానీయాలతో ఆల్కహాల్ వేగంగా రక్తంలోకి ప్రవేశం

త్వరగా మత్తు ఎక్కడంతో పాటు గుండెపై తీవ్ర ఒత్తిడి

డయాబెటిస్, డీహైడ్రేషన్ వంటి సమస్యలు పెరిగే అవకాశం

మరుసటి రోజు హ్యాంగోవర్ కూడా తీవ్రంగా ఉంటుందని వెల్లడి

పార్టీలు, వేడుకల్లో చాలా మంది మద్యం సేవించడం సాధారణమే. అయితే, కొంతమంది ఆల్కహాల్‌ను నేరుగా తాగకుండా, దానికి రుచిని జోడించేందుకు కూల్ డ్రింక్స్ లేదా సోడా వంటి శీతల పానీయాలను కలుపుకుని తాగుతుంటారు. ఈ అలవాటు సరదాగా అనిపించినా, ఇది ఆరోగ్యానికి అత్యంత ప్రమాదకరమని వైద్య నిపుణులు తీవ్రంగా హెచ్చరిస్తున్నారు. ఇలా చేయడం వల్ల తెలియకుండానే తీవ్రమైన అనారోగ్య సమస్యలను కొనితెచ్చుకున్నట్టేనని వారు స్పష్టం చేస్తున్నారు.

### ఎందుకు ప్రమాదకరం?

శీతల పానీయాలలో ఉండే కార్బన్ డయాక్సైడ్ (గ్యాస్) మరియు అధిక మోతాదులో ఉండే చక్కెరలు, ఆల్కహాల్‌ను శరీరం చాలా వేగంగా గ్రహించేలా చేస్తాయి. సాధారణంగా అయితే నెమ్మదిగా రక్తంలో కలిసే మద్యం, వీటితో కలిపి సేవించినప్పుడు నేరుగా రక్త ప్రవాహంలోకి వేగంగా చేరుతుంది. దీని ఫలితంగా, తాగిన వ్యక్తి అనుకున్నదానికంటే చాలా త్వరగా మత్తులోకి జారుకుంటారు. ఇలా మద్యం వేగంగా శరీరంలోకి చేరడం వల్ల రక్తపోటు (బీపీ) అకస్మాత్తుగా పెరిగి గుండెపై తీవ్రమైన ఒత్తిడి పడుతుంది. ఇది దీర్ఘకాలంలో గుండె సంబంధిత వ్యాధులకు దారితీసే ప్రమాదం ఉంది. అంతేకాకుండా, కూల్ డ్రింక్స్‌లో ఉండే అధిక



చక్కెరల వల్ల రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు అమాంతం పెరిగిపోతాయి. ఇది ముఖ్యంగా మధుమేహం (డయాబెటిస్) ఉన్నవారికి చాలా ప్రమాదకరం.

### ఇతర దుష్ప్రభావాలు

ఆల్కహాల్‌కు సహజంగానే శరీరాన్ని డీహైడ్రేట్ (నిర్జలీకరణ) చేసే గుణం ఉంటుంది. దానికి తోడు ఈ చక్కెర పానీయాలు కలిపినప్పుడు డీహైడ్రేషన్ సమస్య మరింత తీవ్రమవుతుంది. ఈ కారణంగానే, మరుసటి రోజు హ్యాంగోవర్ కూడా చాలా ఎక్కువగా ఉండి తలనొప్పి, వికారం వంటి లక్షణాలు తీవ్రంగా బాధిస్తాయి. కాబట్టి, మద్యపానం చేసేటప్పుడు ఇలాంటి మిశ్రమాలకు దూరంగా ఉండటమే శ్రేయస్కరమని వైద్యులు సూచిస్తున్నారు. వీటికి బదులుగా నీళ్లు లేదా ఐస్ ముక్కలు కలుపుకోవడం కొంతవరకు సురక్షితమైన మార్గమని వారు సలహా ఇస్తున్నారు.

ఘనంగా ఖైరతాబాద్ గణనాథుడి ఆవిష్కరణ..

# తొలి పూజ...

మొదటిపేజీ తరువాయి

వినాయక చవితి పర్వదినమైన సోమవారం ఉదయం 10 గంటలకు తెలంగాణ గవర్నర్ చేతుల మీదుగా మహాగణపతికి తొలి పూజ నిర్వహించనున్నారు. ఆ తర్వాత అధికారికంగా భక్తుల దర్శనాలు ప్రారంభమవుతాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా త్వరలో స్వామివారిని దర్శించుకోనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సెప్టెంబర్ 25 వరకు పూజలు కొనసాగనున్నాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మరోవైపు, హైదరాబాద్‌లోని మరో ప్రసిద్ధ గణపతి మండపమైన బాలాపూర్‌లో ఈ ఏడాది పూరీ జగన్నాథ్ ఆలయ థీమ్‌తో మండపాన్ని ఏర్పాటు చేస్తున్నారు.

# తెలంగాణ ధనిక రాష్ట్రం...

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా రోశయ్యతో తనకున్న అనుబంధాన్ని రేవంత్ రెడ్డి గుర్తుచేసుకున్నారు. తాను శాసనమండలిలో దూకుడుగా మాట్లాడినప్పుడు, రోశయ్య తనను పక్కకు పిలిచి కోపాన్ని తగ్గించుకుని అనుభవంతో ముందుకు వెళ్తే ఉన్నత శిఖరాలకు చేరుకుంటావని సలహా ఇచ్చారని వెల్లడించారు. రోశయ్య ఎప్పుడూ కఠినంగా విమర్శించలేదని, తన చతురత, వాగ్ధాటితోనే పదునైన వ్యాఖ్యలు చేసేవారని అన్నారు. హైదరాబాద్‌లో రోశయ్య విగ్రహం ఏర్పాటును కొందరు విమర్శించారని, కానీ నాలుగు దశాబ్దాల క్రితమే హైదరాబాద్‌కు వచ్చి, కష్టసుఖాల్లో ఇక్కడే ఉంటానని చెప్పిన ఆయన మాటకు గౌరవమిచ్చి విగ్రహాన్ని ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రి వివరించారు. ఆర్యవైశ్యులు సౌమ్యులని, ఆత్మగౌరవం, ముందుచూపు, విజ్ఞత వారి డీఎన్ఏలోనే ఉన్నాయని సీఎం ప్రశంసించారు. ఎంతోమంది పేదరికంలో ఉన్నా, ఆత్మగౌరవానికి విలువిచ్చి తమను పేదవారిగా చెప్పుకోవడానికి ఇష్టపడరని అన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ, ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు వంటి మహనీయులు ఆర్యవైశ్య వర్గానికి చెందినవారేనని గుర్తుచేశారు. ఆర్యవైశ్యులకు దక్కాల్సినంత గుర్తింపు రాలేదని పేర్కొన్న సీఎం, ఈ ఆత్మగౌరవ భవనం పేద ఆర్యవైశ్యుల అవసరాలు తీర్చాలని ఆకాంక్షించారు. భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

# ముగిసిన 18వ బ్రిక్స్ సదస్సు.. ప్రపంచ నేతలకు ధన్యవాదాలు తెలిపిన ప్రధాని మోదీ

మొదటిపేజీ తరువాయి

బ్రిక్స్ కూటమి మూడో దశాబ్దంలోకి అడుగుపెడుతున్న తరుణంలో, ప్రపంచం ఈ కూటమి నుంచి కేవలం ఆలోచనలు, వాగ్దానాలు కాకుండా ఉపయోగకరమైన ఫలితాలను ఆశిస్తోందని మోదీ స్పష్టం చేశారు. ఈ సదస్సులో ఆమోదించిన 'న్యూఢిల్లీ డిక్లరేషన్' కూటమి భవిష్యత్ దార్శనికతకు, పరస్పర సహకారానికి స్పష్టమైన దిశానిర్దేశం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సదస్సులో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసా, ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దెల్ ఫతా ఎల్-సిసి, ఇథియోపియా ప్రధాని అబీయ్ అహ్మద్ అలీ, అబుదాబి క్రౌన్ ప్రిన్స్ షేక్ ఖలీద్ బిన్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ వంటి పలువురు దేశాధినేతలు పాల్గొన్నారు. వీరితో పాటు ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్, పలు దేశాల ప్రతినిధులు కూడా హాజరయ్యారు.

# ఆశ్రమ పాఠశాల విద్యార్థిని గర్భం దాల్చిన ఘటన.. హెచ్ఎం సహా ముగ్గురిపై వేటు

మొదటిపేజీ తరువాయి

ఈ దారుణానికి పాల్పడిన పాఠశాల వంట మనిషి మంగరాజుపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు రుక్మాండయ్య పేర్కొన్నారు. బాధితురాలికి అవసరమైన వైద్య సహాయం, కౌన్సెలింగ్ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ ఘటనపై శాఖాపరమైన విచారణ కూడా కొనసాగుతోందని, విచారణ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ సరార్‌ది 33 వేల కోట్ల కుంభకోణం

శాసనసభ సమావేశాల్లో ప్రజాసమస్యలను గాలికొదిలేసి కాంగ్రెస్ పార్టీ తీవ్రమైన భూ అక్రమాలు, అవినీతికి పాల్పడుతున్నదని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సభలో అవినీతిని ప్రశ్నిస్తున్న బీజేపీ గొంతును మైకులు కట్ చేస్తూ అణచివేస్తున్నారని మండిపడ్డారు. నిషేధిత 22ఏ జాబితాపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ 4 గంటలపాటు మతిభ్రమించినట్టు సంబంధం లేకుండా మాట్లాడారే తప్ప 50 లక్షల మంది రైతులు, పేదలకు ఎలాంటి పరిష్కారం చూపలేదని, ఈ మొత్తం భూ బాగోతంపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కుత్బుల్లాపూర్‌లోని ఐడీపీఎల్‌కు చెందిన రూ.33 వేల కోట్ల విలువైన 333 ఎకరాల భూమి ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లినా వెనక్కు తీసుకోకపోవడంలో ప్రభుత్వ పెద్దలకు 30 శాతం వాటాలు ఉన్నాయా అని సూటిగా ప్రశ్నించారు. ప్రభుత్వంలో ఉంటూనే రూ.1,400 కోట్ల కాంట్రాక్టులను రూ.4వేల కోట్లకు పెంచుకోవడం ముమ్మాటికీ క్విడ్-ప్రో-కో అని ధ్వజమెత్తారు. ఈ విషయంపై కేంద్ర దర్యాప్తు సంస్థలు, గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

# టీ. నరసాపురం ఎమ్.ఆర్.పి.ఎస్. సీనియర్ నాయకులు నార్లపాటి దుర్గారావు కన్నుమూత

**టీ. నరసాపురం, సెప్టెంబర్ 13:**

**( ప్రజా వీక్షణం )**

ఏలూరు జిల్లాలోని ప్రముఖ ప్రాంతాలలో ఒకటైన టి. నరసాపురం మండలంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మండల ఎమ్.ఆర్. పి.ఎస్. సీనియర్ నాయకులు, సమాజహితమే ఊపిరిగా బతికిన గొప్ప వ్యక్తి, మందా కృష్ణ మాదిగ వీరాభిమాని నార్లపాటి దుర్గారావు (66) అనారోగ్యంతో శనివారం రాత్రి తుదిశ్వాస విడిచారు. ఆయన అకస్మిక మృతి వార్త దళిత లోకంలోను, స్థానిక ప్రజలలోను తీవ్ర దిగ్భ్రాంతిని, బాధను నింపింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల రోజుల క్రితం దుర్గారావు తలకు చిన్న గాయం తగిలింది. ఆ తర్వాత కాలక్రమేణా ఆ గాయం ప్రభావంతో ఆయన తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. కుటుంబ సభ్యులు ఆయనను కాపాడుకోవడానికి సర్వశక్తులు ఒడ్డారు. ఏలూరు మరియు విజయవాడలోని పలు పేరు గాంచిన ప్రభుత్వ అలాగే ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించి, వైద్య నిపుణుల పర్యవేక్షణలో మెరుగైన వైద్యం అందించారు. అయినప్పటికీ విధి వక్రీకరించడంతో ఆయనను ప్రాణాలతో కాపాడుకోలేకపోయామని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. నార్లపాటి దుర్గారావు కేవలం ఒక సాధారణ నాయకుడే కాదు, దళిత హక్కుల కోసం నిత్యం పరితపించే ఒక యోధుడు. ఎమ్.ఆర్.పి.ఎస్. ఆవిర్భావ దినముల నుండి ఆయన సంస్థతో అరుదైన అనుబంధం కలిగి ఉన్నారు. దళిత జాతి ఆత్మగౌరవ పోరాటంలో మందా కృష్ణ మాదిగకి ఆయన ఎనలేని మద్దతుగా నిలిచారు. రాష్ట్ర కమిటీ నుండి ఎలాంటి పిలుపువచ్చినా క్షణం కూడా ఆలస్యం చేయకుండా దళిత సమస్యలపై జరిగిన అనేక చారిత్రాత్మక పోరాటాలలో ఆయన ముందువరుసలో నిలబడి నాయకత్వం వహించారు. ఆయన చూపిన నిబద్ధత, పోరాట పటిమ యువ నాయకులకు ఎప్పుడూ స్ఫూర్తిదాయకం. మండలంలో ప్రతి ఒక్కరికీ సుపరిచితులుగా, అందరితో ఆప్యాయంగా మెలిగే దుర్గారావు మృతి చెందారనే వార్త దావానలంలా వ్యాపించడంతో టి. నరసాపురం మండలంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఎంతోమంది శ్రేయోభిలాసులు, దళిత సంఘాల నాయకులు జీర్ణించుకోలేకపోయారు. దుర్గారావు మృతి వార్త తెలిసిన వెంటనే వివిధ ప్రాంతాల నుండి దళిత సంఘాల నాయకులు, వివిధ రాజకీయ పార్టీల ప్రముఖులు, సామాజిక కార్యకర్తలు, ఆత్మీయులు, బంధుమిత్రులు భారీ సంఖ్యలో



తరలివచ్చారు. బండ్లచర్ల రోడ్డులోని ఆయన స్వగృహంలో ఉంచిన భౌతికకాయాన్ని సందర్శించి కన్నీటి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారందరూ కలిసి "నార్లపాటి దుర్గారావు అమర్ రహే" అంటూ మిన్నంటేలా నినాదాలు చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ భౌతికకాయం వద్ద నివాళులు అర్పించారు. ఈ సంతాప కార్యక్రమంలో ప్రముఖ దళిత సంఘాల నాయకులు నారపాము దుర్గారావు, పింగుల మధు, తాడిగడప జయరాజు, గంధం రామకృష్ణ, బొడ్డపాటి రమేష్, భీమడోలు మాణిక్యాలరావు, మోదుగు సుధాకర్, బొక్కా శ్రీను, కోలుకులూరి రాంబాబు, తిరువీధుల నాగేశ్వరరావు, అలాగే శాంతి ఆటో యూనియన్ నాయకులు గంటా రాజు తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు, వివిధ గ్రామాల నుండి వచ్చిన బంధుమిత్రులు హాజరై దుర్గారావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు, తమ సంతాపాన్ని ప్రకటించారు.

# వినాయక చవితికి అనుమతులు తప్పనిసరి

శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే చర్యలు తప్పవు

ప్రశాంత వాతావరణంలో పండగ జరుపుకోవాలి

మండల ప్రజలకు చందోలు ఎస్ఐ కే. మాధవరావు శుభాకాంక్షలు

**చందోలు ( బాపట్ల ) : సెప్టెంబర్ 13 ( ప్రజా వీక్షణం )**

వినాయక చవితి పండుగను ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని చందోలు ఎస్ఐ కే. మాధవరావు మండల ప్రజలకు సూచించారు. ముందుగా మండల ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. వినాయక విగ్రహాల ఏర్పాటు, ఉత్సవాల నిర్వహణకు సంబంధిత అధికారుల నుంచి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. నిర్వాహకులు పోలీసుల సూచనలు, నిబంధనలు పాటిస్తూ ఉత్సవాలను నిర్వహించాలని తెలిపారు. పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వాహకులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా వ్యవహరించినా, నిబంధనలు ఉల్లంఘించినా చట్ట ప్రకారం చర్యలు తప్పవని ఎస్ఐ కే. మాధవరావు హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ సోదరభావంతో, ఆనందోత్సాహాలతో వినాయక చవితిని జరుపుకుని ప్రశాంతమైన వాతావరణాన్ని నెలకొల్పాలని ఎస్ఐ ఆకాంక్షించారు.




# కూల్చిన శిలాఫలకానికి బదులు.. అభివృద్ధి శిలాఫలకం

**నందిగామ, సెప్టెంబర్ 13 (ప్రజా వీక్షణం):**

ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం లింగాలపాడు క్రాస్ రోడ్ వద్ద నుంచి చెరువుకొమ్ముపాలెం వరకు రహదారి పునర్నిర్మాణ పనులకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య శంకుస్థాపన చేశారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పీఆర్ నిధులతో రూ.3.71 కోట్ల అంచనా వ్యయంతో ఈ పనులు చేపట్టనున్నారు. ఈ రహదారి నిర్మాణంతో పరిసర గ్రామాల ప్రజలు, రైతులు, విద్యార్థులు, ఉద్యోగులకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని వైసీపీ పాలనలో ధ్వంసం చేశారని ఆమె ఆరోపించారు. "అభివృద్ధి చేస్తే టీడీపీ.. కూల్చితే వైసీపీ.. మళ్లీ నిర్మిస్తే కూటమి" అని పేర్కొన్న సౌమ్య, శిలాఫలకాలు కూల్చడం అభివృద్ధి కాదని, ప్రజలకు ఉపయోగపడే రోడ్లు, వంతెనలు, తాగునీరు, ఆసుపత్రులు నిర్మించడమే నిజమైన ప్రజాసేవ అని అన్నారు. నందిగామ నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి మెరుగైన రహదారి సౌకర్యం కల్పించడమే లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతలు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# కార్యకర్తలే పార్టీకి బలం.. జగన్మోహన్ రెడ్డిని మళ్లీ సీఎం చేయడమే లక్ష్యం

## వ్యక్తిగత విభేదాలు పక్కనపెట్టి స్థానిక పోరులో సత్తా చాటాలి

## వైసీపీ తాడేపల్లిగూడెం మండల విస్తృతస్థాయి సమీక్షలో వడ్డీ రఘురాం నాయుడు పిలుపు

**తాడేపల్లిగూడెం ప్రతినిధి, సెప్టెంబరు 13 (ప్రజా వీక్షణం)**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే వెన్నెముక అని, ప్రతి కార్యకర్తకు అండగా నిలిచి వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడతానని ఆ పార్టీ తాడేపల్లిగూడెం నియోజకవర్గ సమన్వయకర్త వడ్డీ రఘురాం నాయుడు అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కడా ఏకగ్రీవాలకు తావులేకుండా పార్టీ అభ్యర్థులను బరిలో నిలిపి విజయమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. తాడేపల్లిగూడెం మండలంలోని ఎల్ అగ్రహారం గ్రామంలోని కోట్ల ఫంక్షన్ హాలులో ఆదివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల ముఖ్య నాయకుల విస్తృతస్థాయి సమీక్ష సమావేశాన్ని రూరల్ మండల అధ్యక్షుడు చిట్టూరి బాపన్న అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వడ్డీ రఘురాం నాయుడు మాట్లాడుతూ 2019--2024 మధ్య పార్టీ పరంగా జరిగిన కొన్ని తప్పులను గుర్తించి, వాటిని సరిదిద్దుకుని ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. వాలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసిన సమయంలో కార్యకర్తలను సరిగ్గా పట్టించుకోలేదన్న విషయం వాస్తవమేనన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉన్న ప్రజాదరణను చూసి భయపడుతోందని ఆరోపించారు. ఎన్నికల్లో ప్రతి గ్రామంలో పార్టీ అభ్యర్థులు ధైర్యంగా పోటీ చేయాలని, ఎక్కడా ఏకగ్రీవాలకు అవకాశం ఇవ్వకుండా ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాడాలని సూచించారు. మండలంలోని 34 గ్రామాల్లో గ్రామ కమిటీలను ఏర్పాటు చేశామని, ప్రతి గ్రామంలో పార్టీని మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు. 34 గ్రామాల్లో బూత్ స్థాయి ఏజెంట్లు సమర్థవంతంగా పనిచేసి పార్టీ ఓట్లు చెదిరిపోకుండా కృషి చేశారని అభినందించారు.

**'కార్యకర్తలకు నేనున్నాను'**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా మోసిన ప్రతి కార్యకర్తను తాను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటానని రఘురాం నాయుడు భరోసా ఇచ్చారు. వైసీపీ కార్యకర్తలే నా దేవుళ్ళు. కార్యకర్త లేనిదే పార్టీ లేదు.. కార్యకర్త లేనిదే ఈ ఆరడుగుల మనిషి కూడా లేడు అని అన్నారు. వైసీపీకి జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే నాయకుడని, మీతో పాటు తాను కూడా ఒక సాధారణ కార్యకర్తనేనని చెప్పారు. ఎవరైనా కార్యకర్తకు అన్యాయం జరిగినా, ఏ ఇబ్బంది ఎదురైనా వారి వెంట నిలబడేందుకు తాడేపల్లిగూడెంలో లీగల్ కోఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యకర్తలకు న్యాయం జరిగే వరకు కమిటీ పోరాడుతుందని చెప్పారు. పుల్లాయిగూడెం గ్రామంలో వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటనలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా పోరాడారని గుర్తుచేశారు.

**డిజిటల్ కార్డు ఉన్న ప్రతి కార్యకర్త జగన్ కుటుంబ సభ్యులే**

పార్టీ కోసం జెండా మోసిన ప్రతి కార్యకర్తకు డిజిటల్ కార్డులు అందించామని, కార్డులు పొందిన వారంతా జగన్ కుటుంబ సభ్యులేనని రఘురాం నాయుడు అన్నారు. వారి వివరాలన్నీ పార్టీ వ్యవస్థలో నమోదై ఉన్నాయని తెలిపారు. పార్టీ కోసం



కష్టపడిన ప్రతి ఒక్కరికీ భవిష్యత్తులో తగిన గుర్తింపు లభిస్తుందని చెప్పారు. మండల, జిల్లా, రాష్ట్ర కమిటీల్లో పార్టీ కోసం పనిచేసిన వారికి అవకాశం కల్పించామని చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, కౌన్సిలర్, మున్సిపల్ చైర్మన్ తదితర పదవులకు పార్టీ శ్రేణులు పోటీ చేయాలని సూచించారు. గెలిచినా, ఓడినా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీ కోసం పోరాడిన వారే నాయకులుగా ఉంటారని చెప్పారు. జగన్ 2.0 అంటే కార్యకర్తలకు అండగా నిలవడమేనని, మనలను ఇబ్బంది పెట్టిన వారికి సినిమా చూపిద్దాం అని రఘురాం నాయుడు అన్నారు. తనది ఒక్కటే వర్గమని, అది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా మోసిన కార్యకర్తల వర్గమని స్పష్టం చేశారు. గతంలో 151 సీట్లు ఇచ్చి ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డిని ఆదరించారని, అదే ప్రజాభిమానాన్ని తిరిగి సాధించేందుకు ప్రతి కార్యకర్త కష్టపడాలని పిలుపునిచ్చారు. వ్యక్తిగత విభేదాలను పక్కనపెట్టి స్థానిక పోరులో పార్టీ అభ్యర్థుల విజయానికి ఐక్యంగా పనిచేయాలని కోరారు. తాను ఏపీ స్టేట్ ఆక్వా డెవలప్‌మెంట్ అథారిటీ (అప్సడా) వైస్ చైర్మన్‌గా పనిచేసిన సమయంలో ఆక్వా రైతులకు అనేక సేవలు అందించానని, ప్రస్తుతం కార్యకర్తలకు "నేనున్నాను.. నేను విన్నాను" అనే భరోసా కల్పించేందుకే జగన్‌మోహన్‌రెడ్డి తనను తాడేపల్లిగూడెం నియోజకవర్గానికి పంపించారని తెలిపారు. డీఎస్సీ నియామకాల విషయంలో అక్రమాలు, అవినీతి జరిగాయని ఆరోపించిన రఘురాం నాయుడు.. క్రీడా ధ్రువపత్రాల అంశంపైనా విమర్శలు చేశారు. అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ లోకేష్ మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షలో అవకతవకలు జరిగాయని కాక్రోచ్ పార్టీ ఆందోళనకు దిగొచ్చిన కేంద్ర మంత్రి తన పదవికి రాజీనామా చేశారని గుర్తుచేశారు. ఎన్నికల సమయంలో 'సూపర్ సిక్స్' హామీలతో ప్రజలను మభ్యపెట్టి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. మహిళలకు ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1,500 ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేశారని, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామని యువతను కూడా దారుణంగా మోసం చేశారని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ జెండా ఎగరేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. వైఎస్.జగన్మోహన్ రెడ్డిని మళ్ళీ ముఖ్యమంత్రిని చేయటమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని వివరించారు. పలువురు నాయకులకు డిజిటల్ కార్డులను అందజేశారు. కార్యకర్తలు "జై జగన్.. జై రఘురాం నాయుడు" అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పోనుకుమాటి శేషులత, గొర్రెల శ్రీనివాసరావు, కైగాల శ్రీనివాసరావు, గుండుమొగుల బలుసులరావు, వీర్ల గోవింద్, మాకరాజు సతీష్, సబ్బితి బ్రహ్మయ్య, దారపురెడ్డి శ్రీనివాస్, వీరమల్లు వెంకన్న, నార్ని నాగేశ్వరరావు, కౌలూరి వెంకన్న, తానేటి అజయ్, రాజా త్రినాధ్, వట్టి బుజ్జి, రమేష్ రెడ్డి, పట్నాల గణపతి, మాకిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, మద్దిపాటి సురేష్, గోపి తదితరులు పాల్గొన్నారు.

# దిండువారిపాలెం గ్రామంలో ఇసుక కాలువను ఆక్రమిస్తున్న ఆక్రమణదారులు

**కర్లపాలెం : సెప్టెంబర్ 13 ( ప్రజా వీక్షణం )**

బాపట్ల జిల్లా బాపట్ల నియోజకవర్గం కర్లపాలెం మండలంలోని దిండువారి పాలెం గ్రామంలో ఇసుక కాలువను ఆక్రమిస్తున్న ఆక్రమణ దారులు. ఇరిగేషన్ శాఖ అధికారులు మొద్దు నిద్రలో కాలువను తూములతో పూర్తిగా మూసివేస్తున్నారని రైతన్నలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ కాలువ ద్వారా బిడారు దిబ్బ,దమన్న వారి పాలెం,పుచ్చకుర్తి వారి పాలెం గ్రామములలో అనేక ఎకరాల భూమి సాగులో ఉంది. పంటలు పండించటానికి ఈ కాలువ ద్వారా నీరు వెళుతుంది. అసలు ఎటువంటి అనుమతులు లేకుండా ఎవరు ఏమి చేస్తారు అనే ఉద్దేశ్యంతో ఇలా తూములు వేయటమ్ తో నీటి కష్టాలు ఉన్నాయి అని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ అధికారుల కు తెలిసి కూడా ఇలా కాలువను అనుమతులు లేకుండా ఆక్రమిస్తే రానున్న రోజుల్లో రైతన్నల పరిస్థితి ఏమిటి? అనుమతులు లేకుండా రైతన్నల పొట్ట కొడుతున్న ఆక్రమణ దారుల పై చర్యలు తీసుకొని వేసిన తూములు తీయాలి అని అనేక మంది ప్రజలు,రైతులు కోరుతున్నారు.



# దుద్దుకూరు క్యాంప్ కార్యాలయంలో ఘనంగా ఏలూరు జిల్లా మాజీ వికలాంగుల ప్రధాన కార్యదర్శి బానోత్ జస్వంత్ నాయక్ జన్మదిన వేడుకలు

## ముఖ్య అతిథిగా విచ్చేసి జస్వంత్ నాయక్‌కు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపిన పోలవరం మాజీ శాసనసభ్యులు తెల్లం బాలరాజు

## చిన్నారుల కోలాహలం, కేరింతల మధ్య కేక్ కట్ చేసి పండుగ వాతావరణంలో సాగిన వేడుకలు

**దుద్దుకూరు సెప్టెంబర్ 13(ప్రజా వీక్షణం):**

ఏలూరు జిల్లా మాజీ వికలాంగుల ప్రధాన కార్యదర్శి, ప్రజా సేవకుడు బానోత్ జస్వంత్ నాయక్ పుట్టినరోజు వేడుకలు దుద్దుకూరు క్యాంప్ కార్యాలయంలో అత్యంత వైభవంగా, ఆనందోత్సాహాల నడుమ నిర్వహించారు. ఈ వేడుకలకు పోలవరం నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు తెల్లం బాలరాజు ముఖ్య అతిథిగా విచ్చేసి, జస్వంత్ నాయక్ ని ఆప్యాయంగా పలకరించి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ పుట్టినరోజు వేడుకల్లో ప్రధాన ఆకర్షణగా నిలిచిన చిన్నారుల సమక్షంలో బానోత్ జస్వంత్ నాయక్ కేక్ కట్ చేశారు. చిన్నారులు కేరింతలు కొడుతుండగా, వారి మధ్య జస్వంత్ నాయక్ కేక్ కట్ చేసి అందరికీ తినిపించారు. ఈ సందర్భంగా కార్యాలయ ప్రాంగణంలో పండగ వాతావరణం నెలకొంది. చిన్నారులకు మిఠాయిలు, చాక్లెట్లు పంపిణీ చేయడంతో వారి మొఖాల్లో వెలకట్టలేని ఆనందం కనిపించింది.ఈ కార్యక్రమంలో పోలవరం మాజీ శాసనసభ్యులు తెల్లం బాలరాజు మాట్లాడుతూ, బానోత్ జస్వంత్ నాయక్ కేవలం ఒక పదవికే పరిమితం కాకుండా, వికలాంగుల సంక్షేమం కోసం, వారి హక్కుల పరిరక్షణ కోసం జిల్లా స్థాయిలో నిరంతరం శ్రమించారని కొనియాడారు. యువత సేవా దృక్పథం కలిగి ఉండాలనేదానికి జస్వంత్ నాయక్ ఒక మంచి ఉదాహరణ అని, ఆయన భవిష్యత్తులో రాజకీయంగా, సామాజికంగా మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మనసారా ఆశిస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకల్లో స్థానిక పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, సన్నిహితులు, యువజన సంఘాల సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో చిన్నారులు పాల్గొని జస్వంత్ నాయక్ కి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అందరి సమక్షంలో జరిగిన ఈ వేడుకలు జస్వంత్ నాయక్ జీవితంలో ఒక మరువలేని జ్ఞాపకంగా నిలిచాయి. అలాగే జస్వంత్ నాయక్ జన్మదినం సందర్భంగా ఏలూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న పలువురు ప్రముఖులు, శ్రేయోభిలాషులు ఫోన్ ద్వారా మరియు సోషల్ మీడియా వేదికగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.)



# ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన బాపట్ల జనసేన నాయకులు,అఖండ ఫౌండేషన్ అధ్యక్షులు విన్నకోట సురేష్

## ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను వీడి, పవిత్రమైన మట్టి వినాయక ప్రతిమలనే పూజించాలని పిలుపు

## పూర్వకాలం నాటి సంప్రదాయాలను పాటిస్తూ పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని వెల్లడి

## బాపట్ల నియోజకవర్గ ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో,పర్యావరణ హితంగా పండుగను జరుపుకోవాలని ఆకాంక్ష

**బాపట్ల : సెప్టెంబర్ 13 ( ప్రజా వీక్షణం )**

సకల విఘ్నాలను తొలగించి శుభాలు ప్రసాదించే ప్రథమ పూజ్యుడు శ్రీ విఘ్నేశ్వరుని పర్వదినాన్ని పురస్కరించుకుని బాపట్ల నియోజకవర్గ ప్రజలందరికీ జనసేన పార్టీ నాయకులు అఖండ ఫౌండేషన్ అధ్యక్షులు విన్నకోట సురేష్ హృదయపూర్వక వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆదివారం ఆయన ప్రత్యేకంగా ఒక ప్రకటన విడుదల చేస్తూ, గణనాథుని ఆశీస్సులతో బాపట్ల నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని మనసారా ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విన్నకోట సురేష్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ పూర్తిగా మట్టితో తయారు చేసిన వినాయక ప్రతిమలనే పూజించాలని పిలుపునిచ్చారు. మన పూర్వకాలం నుండి పసుపు, మట్టితో పాటు వివిధ సహజ సిద్ధమైన సుగంధ ద్రవ్యాలతో గణనాథులను తయారు చేసుకుని పూజించడం మన సనాతన సంప్రదాయమని గుర్తుచేశారు. నేడు వాడకంలో ఉన్న ప్లాస్టర్ ఆఫ్ పారిస్ రసాయన రంగుల విగ్రహాల వల్ల నీటి వనరులు, జలచరాలు, పర్యావరణం తీవ్రం గా కలుషితమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాబట్టి పర్యావరణానికి ముప్పు తెచ్చే వాటికి పూర్తిగా దూరంగా ఉంటూ, మట్టి ప్రతిమలను పూజించడం ద్వారా ప్రకృతిని కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు.



అఖండ ఫౌండేషన్ ద్వారా పర్యావరణ పరిరక్షణ కోసం తాము నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని,ప్రజలు కూడా సామాజిక బాధ్యతగా ఈ వినాయక చవితి వేడుకలను అత్యంత నిబద్ధతతో,ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. బాపట్ల ప్రాంత ప్రజలంతా పండుగను ఆనందోత్సాహాలతో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని ఆయన మరోసారి కోరారు.

# అక్షరాలకు అంకితమైన గురువుకు అరుదైన గౌరవం

## ఉత్తమ ఉపాధ్యాయుడిగా చింతల కొండయ్యకు 'టీచర్ అవార్డ్--2026'

**తాడేపల్లిగూడెం ప్రతినిది, సెప్టెంబర్13 (ప్రజా వీక్షణం)**

తెలుగు భాషపై మమకారంతో.. విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యంగా.. విద్యాబోధనను అంకితభావంతో నిర్వహిస్తూ ఎంతోమంది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న తెలుగు ఉపాధ్యాయుడు చింతల కొండయ్యకు ప్రతిష్ఠాత్మక ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు--2026 దక్కింది. సలాం నమస్తే గుంటూరు సొసైటీ, టీచర్స్ హబ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలోగుంటూరులో ఆదివారం నిర్వహించిన టీచర్ అవార్డ్ సెలబ్రేషన్--2026 వేడుకల్లో ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. తాడేపల్లిగూడెం మండలం చిన్నతాడేపల్లిలోని చైతన్య పాఠశాలలో 2012 నుంచి కొండయ్య (జగ్గన్నపేట) తెలుగు ఉపాధ్యాయుడిగా సేవలు అందిస్తున్నారు. పుష్కరకాలానికి పైగా ఎంతోమంది విద్యార్థులకు తెలుగు బోధిస్తూ, వారిలో భాషపై ఆసక్తిని పెంపొందించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు నైతిక విలువలు, సంస్కృతి, భాషా ప్రాధాన్యతను తెలియజేస్తూ తనదైన బోధనా శైలితో అందరిని ఆకట్టుకోవటంతో పాటు మంచి గుర్తింపు పొందారు. దేశవ్యాప్తంగా 14 రాష్ట్రాల నుంచి 5 వేల మంది దరఖాస్తులు చేసుకోగా నిర్వాహకులు వాటిని పరిశీలించి వెయ్యి మందిని అవార్డులకు ఎంపికచేశారు. విద్యారంగంలో కొండయ్య అందిస్తున్న సేవలను గుర్తించిన నిర్వాహకులు టీచర్ అవార్డ్ సెలబ్రేషన్--2026లో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేసి గ్లోబల్ ఐకానిక్ ఎడ్యుకేషన్ అవార్డును ప్రధానం చేశారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫౌండర్ అండ్ చైర్మన్ షేక్ భాషా, ప్రముఖ విద్యావేత్త నూతలపాటి తిరుపతయ్య, మ్యాథ్స్ అండ్ ఫిజిక్స్ టీచర్, ఇన్సూరెన్స్ అడ్వైజర్ ఏ.రత్నరాజు, చేతుల మీదుగా కొండయ్య ఈ అవార్డును అందుకోవటం విశేషం.

**అవార్డు తనపై మరింత బాధ్యతను పెంచిందని,**

పురస్కార గ్రహీత, తెలుగు ఉపాధ్యాయుడు చింతల కొండయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా విద్యా ర్థులకు మంచి మార్గనిర్దేశం చేయడం తన బాధ్యతగా భావిస్తున్నానని తెలిపా రు. తన సేవలను గుర్తించి అవార్డుతో సత్కరించడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. వినాయక చవితి పండుగకు ఒకరోజు ముందే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకోవ డం ఎంతో గర్వంగా, సంతోషంగా ఉందని తెలిపారు. ఆ విఘ్నేశ్వరుడి ఆశీస్సులు తనపై ఎల్లప్పుడూ ఉండాల ని మనస్ఫూర్తిగా కోరుకుంటు న్నానని తెలిపారు. ఈ అవార్డు తనపై మరింత బాధ్యతను పెంచిందని



చెప్పారు. విద్యార్థులకు మరింత అంకితభావంతో, నూతన ఉత్సాహంతో సేవలందించేందుకు ఈ పురస్కారం ఎంతో ప్రోత్సాహాన్ని ఇచ్చిందని వివరించారు.

**కొండయ్యకు అభినందనలు**

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్న కొండయ్యను చైతన్య పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, పలువురు ప్రజాప్రతినిధులు, మిత్రులు, జగ్గన్నపేట గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

# ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో వినాయక విగ్రహాల పంపిణీ

**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 13(ప్రజా వీక్షణం):**

కొత్తగూడెం పట్టణ ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా 51వ డివిషన్ కార్పొరేటర్ కంభంపాటి దుర్గా ప్రసాద్, అధ్యక్షుడు కొదుమూరి సురేష్ బాబు ఆర్యవైశ్యలు అందరూ కలిసి పాల్గొని ఉచిత మట్టి వినాయకుని ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కొదుమూరి సురేష్ బాబు, ప్రధాన కార్యదర్శి రేపాక మనోహర్, కోశాధికారి కూరా ప్రసాద్, గౌరవ అధ్యక్షులు దారా నాగేష్, గౌరవ అధ్యక్షులు పల్లపోతు శ్రీనివాస్(వాసు), పల్లపోతు శ్రీనివాస్(చిన్న వాసు), కంభంపాటి రమేష్, వల్లాల రమణ, శీమకుర్తి నాగరాజా తరుణ్, దారా కిరణ్, నరేంద్రుల రిషి, చెల్లా శేఖర్, చారుగుల్ల సుధాకర్, దోంతుల అరుణ్ కుమార్, ఉప్పల శ్రీనివాస్, వంగవీటి శ్రీకాంత, గరిని చిన్న, కోదుమూరు సత్యనారాయణ, వందనపు రవి కిషోర్, కొయ్యడ నాగేష్, గునీపాటి సుధాకర్, వారణాశి సురేష్, వెమిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రతి ఇంట్లో సుఖసంతోషాలు నిండాలని విఘ్నేశ్వరుడిని కోరుకున్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

## పోలవరం నియోజకవర్గ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

**పోలవరం నియోజకవర్గం సెప్టెంబర్ 13(ప్రజా వీక్షణం)**

ఏలూరు జిల్లా పోలవరం నియోజకవర్గ ప్రజలందరికీ వినాయక చవితి పర్వదిన శుభాకాంక్షలను పోలవరం నియోజకవర్గ శాసనసభ్యులు (ఎమ్మెల్యే) చిర్రి బాలరాజు ఘనంగా తెలియజేశారు. సమస్త విఘ్నాలను తొలగించి, భక్తుల కష్టాలను కడతేర్చే దైవంగా భావించే ప్రథమ పూజ్యుడు విఘ్నేశ్వరుని ఆశీస్సులతో నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరి జీవితంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, శాంతి సౌభాగ్యాలు పరిమళించాలని ఆయన మనసారా ఆకాంక్షించారు. ప్రకృతి సిద్ధమైన వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో ఈ పండుగను జరుపుకోవాలని పిలుపునిచ్చారు .వినాయక చవితి వేడుకల సందర్భంగా పోలవరం నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో, పట్టణంలోని ప్రతి వీధిలో ఉత్సాహంగా ఏర్పాటు చేసే వినాయక మండపాల వద్ద భక్తులు, నిర్వాహకులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు పాటించాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సూచించారు. ముఖ్యంగా మండపాల నిర్వహణలో అగ్నిప్రమాదాలు లేదా ఇతర అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసు శాఖ అధికారులు, ప్రభుత్వ యంత్రాంగం జారీ చేసే నిబంధనలు, మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలని కోరారు. పండుగను ఎలాంటి వివాదాలకు తావులేకుండా, ప్రశాంత వాతావరణంలో, ఆనందోత్సాహాల మధ్య నిర్వహించుకోవాలని విజ్ఞప్తి చేశారు.వినాయక చవితి నవరాత్రి వేడుకల ముగింపు ఘట్టమైన వినాయకుని నిమజ్జన కార్యక్రమంలో ప్రజలు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే తెలిపారు. నిమజ్జన ఊరేగింపులు మరియు జలాశయాల వద్ద జరిగే కార్యక్రమాలలో పోలీసు మరియు ప్రభుత్వ శాఖల అధికారులు సూచించే సూచనలకు, హెచ్చరికలకు అనుగుణంగా నడుచుకోవాలని కోరారు. అధికారులకు ప్రజలు, యువజన సంఘాల సభ్యులు సంపూర్ణ సహకారం అందించి, ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. అలాగే "వినాయకుని కృపాకటాక్షాలతో పోలవరం నియోజకవర్గంలోని ప్రతి కుటుంబం సుఖశాంతులతో, సిరిసంపదలతో కళకళలాడాలని మనసారా కోరుకుంటున్నాను. కులమతాలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా జరుపుకునే ఈ పండుగ ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలి. ప్రతి ఒక్కరూ ఎటువంటి ప్రమాదాలకు తావులేకుండా, భక్తిశ్రద్ధలతో, సురక్షితమైన రీతిలో వినాయక చవితి పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఆ దేవుడిని ప్రార్థిస్తున్నాను" అని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తెలిపారు.



ప్రజావీక్షణం దినపత్రిక

GENERAL NEWS

14 సోమవారం సెప్టెంబర్ 2026

5

www.prajaveekshanam.in

# ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ బాపట్ల నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి గా జీలానీ

**బాపట్ల : సెప్టెంబర్ 13 ( ప్రజా వీక్షణం )**

ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీ బాపట్ల నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా షేక్.జీలాని నియామకమయ్యారు. ఆదివారం బాపట్ల పార్టీ కార్యాలయంలో జరిగిన పార్టీ సమావేశంలో జిల్లా అధ్యక్షులు షేక్ అబ్దుల్ బషీర్ జీలానిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా షేక్ జిలానినీ పార్టీ కండువాగప్పి సాధరంగా పార్టీలో ఆహ్వానించారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాజా మాట్లాడుతూ మంచి వారు, సౌమ్యులు,ప్రజల మనిషి అయిన షేక్ జిలాని పార్టీలో నియోజకవర్గ బాధ్యతలు స్వీకరించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. వేటపాలెం మండల అధ్యక్షులు షేక్ కరీం మాట్లాడు తూ.....నియోజకవర్గంలో ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీ బలోపేతం కోసం ఆయన కృషి చేస్తారని ఆకాంక్షించారు.షేక్ జిలాని మాట్లాడుతూ తనపై నమ్మకంతో నియోజవర్గ అధ్యక్షునిగా బాధ్యతలు అందించిన ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీ జిల్లా అధ్యక్షులు వారికి,పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలియజేశారు.రానున్న రోజుల్లో ప్రజలలో మమేకమై పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకు వెళ్తానని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.



# విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం సన్నాహక సమావేశం

**చీరాల : సెప్టెంబర్ 13 ( ప్రజా వీక్షణం )**

విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం సన్నాహ సమావేశానికి కూటమి నాయకులు బాపట్ల జిల్లా చీరాల లోని 16 వార్డు లో జనసేన కార్యాలయం జనసేన నాయకులు కదలి లక్ష్మణ్ అధ్యక్షతన సమావేశాన్ని ఏర్పాటు చేసి 17వ తారీకు జరిగు విశ్వకర్మ యజ్ఞ మహోత్సవము మరియు ఆయుధ పూజా కార్యక్రమానికి సంబంధించిన కార్యక్రమాన్ని ఏవిధంగా నిర్వహించాలి అనే దానిపై చర్చించారు.ఈ కార్యక్రమానికి చీరాల ఎమ్మెల్యే కొండయ్య ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వ సమన్వయంతో విజయవంతంగా ఈ కార్యక్రమాన్ని విశ్వకర్మ యజ్ఞ కార్యక్రమాన్ని కార్మికుల దినోత్సవం గా నిర్వహించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు డాక్టర్ తాడివలస దేవరాజు,మానేపల్లి బాలాజీ, సన్నమూరి శ్రీనివాస్ చారి,జనసేన నాయకులు కదలి లక్ష్మణ్,హనుమకొండ కిషోర్,పాలవలస శ్రీనివాస్ , పాపిశెట్టి అంజిబాబు పాల్గొన్నారు.



# గ్రాండ్ గా “కారు” పార్కింగ్..!

## - పార్కింగ్ కు అడ్డగా మారిన జాతీయ రహదారి
## - రాకపోకల వాహనాలకు అసౌకర్యం
## - ప్రమాదాలు జరిగితే బాధ్యత ఎవరిది..
## - ట్రాఫిక్ పోలీస్ వింగ్ ఇటు వైపు దృష్టి ఏది..

**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 13(ప్రజా వీక్షణం):**

అసలే ఇక్కడ ఇరుకు రోడ్డు.. ఆపై రోడ్డు మధ్యలో డివైడర్.. ఇరువైపులా రహదారి పక్కనే అడ్డదిడ్డంగా పార్కింగ్.. ఇక రాకపోకలు సాగించే వారి ఇబ్బందికర బాధ వర్ణాతీతం.. ఏకంగా జాతీయ రహదారిని పార్కింగ్ అడ్డాగా మార్చేసిన దారుణ పరిస్థితి నెలకొంది. ఈ పార్కింగ్ దృశ్యం ట్రాఫిక్ వింగుకు కనిపించడం లేదా అంటూ జనం ప్రశ్నిస్తున్నారు.. ద్విచక్ర వాహనదారుల నెంబర్ ప్లేట్ల ఫోటోలు తీసి చలాన్లు విధించే ట్రాఫిక్ బృందానికి.. ఈ జాతీయ రహదారిపై పార్కింగ్ కనిపించడం లేదా.. అని ప్రజలు అసహన వ్యక్తపరుస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోస్ట్ ఆఫీస్ సెంటర్ నుండి సింగరేణి ప్రధాన కార్యాలయం మీదగా విజయవాడకు వెళ్లే జాతీయ రహదారినే పార్కింగ్ అడ్డాగా మార్చేశారు. ఇలా ఎవరు మార్చారంటే ట్రాఫిక్ పోలీసులే తేల్చాల్సిన అవసరం ఉందని పలువురు సూచిస్తున్నారు. సెయింట్ మేరీ హై స్కూల్ ఎదురుగా గల ప్రధాన రహదారిపై అప్పుడప్పుడు “కారు” పార్కింగ్ దృశ్యాలు కనిపిస్తుంటాయి. ఈ ప్రాంతంలో ఒక ఫంక్షన్ హాల్ ఉండడంవల్ల అందులో జరిగే శుభకార్యాలకు వచ్చేవారు కార్లలో వస్తుంటారు. కార్ల యజమానులు రోడ్డు పక్కనే పార్కింగ్ చేసి గంటల తరబడి శు భకార్యాలలో ఉండటంవల్ల ఇక్కడ పార్కింగ్ చేసిన కార్లతో ఇతరులకు ద్విచక్ర వాహనదారులకు ఇబ్బందికరంగా మారింది. ఈ ఇబ్బందికర దృశ్యాలు ట్రాఫిక్ పోలీస్ బృందానికి కనిపించడం లేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ ప్రాంతంలో ఏమైనా ప్రమాదాలు జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారని జనం గర్జిస్తున్నారు. ప్రాణాలు పోయిన తర్వాత హడావుడి చేసేది ఏం లాభమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరిగి గాయాలపాలై, ఎవరి ప్రాణాలు పోకముందే జాతీయ రహదారిపై “కార్ పార్కింగ్” చేయకుండా ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



# ప్రభుత్వ భూమిని వెంటనే గుర్తించాలి

## - సమీకృత గురుకుల పాఠశాల నిర్మించాలి...

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సెప్టెంబర్ 13 (ప్రజా వీక్షణం న్యూస్)**




కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ నియోజకవర్గంలో ని పెంచికల్ పేట మండలంలో సమీకృత గురుకుల పాఠశాల సాధన జె ఎ సి కన్వీనర్ ఎలగం దుల తిరుపతి, తెలిగె రమేష్, పుల్లం దామాజీ, ఆల్ తెలంగాణ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ సుంపుటం సాయికిరణ్ నిర్వహిస్తున్న ఈ సాధన దీక్షకు 7వ రోజు తేదీ ఈ రోజున పెంచి కల్ పేట్ మండల కేంద్రంలోనే సమీకృత గురుకుల పాఠశాల నిర్మాణానికి అవసరమైన 25 ఎకరాల ప్రభుత్వ భూమిని సంబం ధిత శాఖ అధికారులు వెంటనే గుర్తించి కెటాయించాలని ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ప్రత్యేక చొరవ తీసుకొని సమస్య చిక్కుముడి విప్పి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు భక్తు రామ్ చందర్, శేక్ ఉస్మాన్, ఉప సర్పంచ్ టాకిరే అనిల్, కాంగ్రెస్ మండల నాయకులు లోన్కరి రమేష్, అల్లూరి రాజు, బిజెపి మండల అధ్యకులు కుకిడే రాజేశ్వర్, నాయకులు గణపురం నాగేష్, జునగరి మదుకర్, చప్పిడే సత్యనారాయణ, డొకే నారాయణ, పాగిడి అనంత్ రావ్, బండి ప్రభాకర్, తెలిగే రాజన్న, బి ఆర్ ఎస్ నాయకులు చౌదరి తిరుపతి, తెలిగే సత్యనారాయణ, మండల సాధన సమితి కన్వీనర్ బిట్టి శ్రీనివాస్, పోట్టే నరేష్, ఎల్కరి లచ్చన్న, తోట రాజ్ కుమార్, వివిధ గ్రామాల యువత, ప్రజలు పాల్గొన్నారు .తేదీ 14-09-2026 చలో కాగజ్ నగర్ పెంచికల్ పేట్ మండల కేంద్రంలోని ఎల్కపల్లి శివారులోని 61 సర్వే నెంబర్ లో 25 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించి, సమీకృత గురుకుల పాఠశాల నిర్మించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని అన్ని పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు, యువత, ప్రజలు కలిసి స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ని కలవడానికి నిర్ణయించడం జరిగింది..ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునివ్వడం కోరారు.



# మట్టి వినాయకుడినే పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

## తెదేపా రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గొర్రెల శ్రీధర్

**తాడేపల్లిగూడెం ప్రతినిధి, సెప్టెంబరు 13 (ప్రజా వీక్షణం)**

పర్యావరణ పరిరక్షణలో భాగంగా గొర్రెల లక్ష్మీనారాయణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, తాడేపల్లిగూడెం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గొర్రెల శ్రీధర్ పర్యవేక్షణలో పట్టణంలోని 14, 17, 18, 19వ వార్డులతో పాటు మెయిన్‌రోడ్ ప్రాంతాల్లో ప్రజలకు మట్టి వినాయక విగ్రహాలను, వినాయక చవితి వ్రత సంకల్ప పుస్తకాలను ఆదివారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గొర్రెల శ్రీధర్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. వినాయక చవితి సందర్భంగా భక్తులు మట్టి వినాయక విగ్రహాలను పూజించడం ద్వారా పర్యావరణానికి మేలు చేసినవారవుతారని తెలిపారు. రసాయనాలతో తయారైన విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని, అందువల్ల ప్రతి ఒక్కరూ మట్టి వినాయకుడినే పూజించాలని పిలుపునిచ్చారు. వినాయక చవితి పర్వదినం సందర్భంగా ప్రజలందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రతి ఒక్కరి జీవితంలో విఘ్నాలు తొలగి, సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, కూటమి నాయకులు, గొర్రెల శ్రీధర్ మిత్ర బృందం, గొర్రెల శ్రీధర్ యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




# వ్యక్తిగత దూషణలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు..

## వివిధ పార్టీల నాయకులకు కాగజ్‌నగర్ డీఎస్పీ వహీదుద్దిన్ హెచ్చరిక

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సెప్టెంబర్ 13 (ప్రజా వీక్షణం న్యూస్)**



కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలో రాజకీయ పార్టీల కు చెందిన నాయకులు పరస్పరం వ్యక్తిగత దూషణలకు పాల్పడితే చట్టపరం గా చర్యలు తప్పవని కాగజ్‌నగర్ డీఎస్పీ వహీదుద్దిన్ హెచ్చరించారు. నాయకులు ప్రెస్‌మీట్లు ఏర్పాటు చేసి ఒకరిపై ఒకరు వ్యక్తిగత ఆరోపణలు, అనుచిత వ్యాఖ్యలు చేయడం లేదా సామాజిక మాధ్యమాల ద్వారా వ్యక్తిగత దూషణలు, అవమానకర పోస్టులు, వ్యాఖ్యలు చేయడం వంటి చర్యలకు పాల్పడవద్దని సూచించా రు.రా జకీయంగా విధానాలు, ప్రజా సమస్యలపై విమర్శలు చేసుకోవచ్చు కానీ వ్యక్తిగతంగా కించపరిచే విధంగా వ్యాఖ్య లు చేయడం, సోషల్ మీడియాలో పరస్పరం దూషణల కు దిగడం వల్ల శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉందన్నారు. ఇటువంటి చర్యలపై పోలీసుల దృష్టికి వస్తే సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని డీఎస్పీ స్పష్టం చేశారు.ప్రజలు, రాజకీయ నాయకులు సామాజిక మాధ్యమాలను బాధ్యతాయుతంగా వినియోగించాలని, ఎలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు, వివాదాస్పద పోస్టులు చేయకుండా సంయమనం పాటించాలని డీఎస్పీ వహీదుద్దిన్ సూచించారు.

# జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు

## హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 13 (ప్రజా వీక్షణం న్యూస్)**

విఘ్నేశ్వరుని అనుగ్రహం తో జిల్లా ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియా లని హనుమ కొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆకాంక్షించారు. వినాయక చవితి సందర్భ ంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తూ పర్యావ రణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్టించి పూజిం చాలని కోరారు.



# గ్రామస్థాయిలో బీజేపీని బలోపేతం చేయాలి

**పెద్దపారుపూడి సెప్టెంబర్ 13 (ప్రజా వీక్షణం )**

కృష్ణాజిల్లా పామర్రు నియోజవర్గం పెద పారుపూడి మండలం: గ్రామీణ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడంలో ప్రతి కార్యకర్త కీలక పాత్ర పోషించాలని మండల అధ్యక్షుడు దొండపాటి శివాజీ అన్నారు. ఆదివారం మండల బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన మండల పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు.ముఖ్యఅతిథిగా పాల్గొన్న పామర్రు నియోజకవర్గ ఇంచార్జ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమద్దాలి ఫణికుమార్ మాట్లాడుతూ ప్రతి గ్రామానికి బీజేపీని తీసుకెళ్లి బలోపేతం చేయాలని, రానున్న స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నిర్వహించనున్న సేవ సంకల్ప అభియాన్‌ను అన్ని పంచాయతీల్లో విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు సురపనేని దుర్గారాణి గుడివాడ అసెంబ్లీ కన్వీనర్ ఎర్రపోతు అర్జున్, కార్యకర్తలు పాల్గొన్నారు.




# ఆగిన రహదారి పనులకు మళ్లీ కదలిక..

## చెరుకుంపాలెం రోడ్డుకు రూ.3.71 కోట్లు

**నందిగామ సెప్టెంబర్ 13 (ప్రజా వీక్షణం)**

ఎన్టీఆర్ జిల్లా నందిగామ చందర్లపాడు .ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి చెరుకుంపాలెం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో శ్రీమతి తంగిరాల సౌమ్య కృషితో రూ.26 0 లక్షల అంచనా వ్యయంతో శంకుస్థాపన చేసి పనులు చేపట్టారు. అయితే వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం పనులు నిలిచిపోయా యని తెలిపారు.తాజాగా 2026లో తంగిరాల సౌమ్య చొరవతో పంచాయ తీరాజ్ నిధుల నుంచి రూ.3.71 కోట్లు కేటాయించి అదే రహదారి పునర్నిర్మా ణానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. రహదారి పునర్నిర్మాణంతో నిత్యం రాకపో కలు సాగించే ప్రజలకు ఇబ్బందు లు తొలగనున్నాయని పేర్కొన్నారు.వైకాపా పాలనలో రోడ్ల అభివృద్ధి నిర్లక్ష్యానికి గురైందని టీడీపీ వర్గాలు విమర్శించాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వ హయాంలో నందిగామ నియోజకవర్గంలో రోడ్ల మరమ్మతులు, నూతన రహదారుల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.



# జంగారెడ్డిగూడెం మండలం లక్కవరంలో వినాయక ఉత్సవ కమిటీలతో పోలీసుల ప్రత్యేక సమావేశం





### డీజేలు పెడితే పీడీ యాక్టే.. లక్కవరంలో వినాయక ఉత్సవ కమిటీలకు పోలీసుల హెచ్చరిక

**లక్కవరం సెప్టెంబర్ 13(ప్రజా వీక్షణం):**

ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం, లక్కవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల వినాయక చవితి ఉత్సవ కమిటీ సభ్యులతో లక్కవరం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం సాయంత్రం ఒక ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు .జంగారెడ్డిగూడెం డిఎస్పి వెంకటేశ్వర్లు, సర్కిల్ ఇన్స్పెక్టర్ సుభాష్ ఆదేశాల మేరకు జరిగిన ఈ సమావే శానికి లక్కవరం ఎస్సై జబీర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన తన సిబ్బందితో కలిసి వినాయక చవితి ఉత్సవాలు, నిమజ్జన ఊరేగింపుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏపీ పోలీస్ శాఖ నిబంధనలపై కమిటీ సభ్యులకు పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఎస్సై జబీర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఏర్పాటు చేసే ప్రతి వినాయక మండపానికి తప్పనిసరిగా పోలీస్ శాఖ అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే, నిమజ్జన ఊరేగింపునకు ముందే రూట్ మ్యాప్ తెలియజేసి ముందస్తు అనుమతి పొందాలని సూచించారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం డీజే సౌండ్‌లకు అసలు అనుమతి లేదని, రాజకీయ నాయకుల పాటలను కూడా ఊరేగింపుల్లో నిషేధించడం జరిగిందని హెచ్చరించారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా పెద్ద శబ్దాలతో కూడిన సౌండ్ సిస్టమ్ వాడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తేల్చిచెప్పారు.అలాగే, మండపాల వద్ద విద్యుత్ అలంకరణలు చేసేటప్పుడు తగిన భద్రతా జాగ్రత్తలు తీసుకోవాలని, దీనికోసం విద్యుత్ శాఖ వారి అనుమతి కూడా తప్పనిసరి అని తెలిపారు. ఊరేగింపులో మద్యం సేవించి, గొడవలకు దిగితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నిమజ్జన సమయంలో చెరువులు, కాలువల వద్ద చిన్న పిల్లల విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పండుగ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసులకు పూర్తిగా సహకరించాలని కోరారు. ఒకవేళ శాంతిభద్రతలకు భంగం కలిగించేలా ఎవరైనా వ్యవహరిస్తే ఆ సమాచారాన్ని వెంటనే పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని ఎస్సై జబీర్ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో లక్కవరం పోలీస్ సిబ్బంది, వివిధ గ్రామాల వినాయక ఉత్సవ కమిటీల అధ్యక్షులు, కార్యదర్శులు మరియు సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జయప్రద ఫౌండేషన్ నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన

**జగ్గయ్యపేట సెప్టెంబర్ 13 (ప్రజా వీక్షణం )**

ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట జయప్రద ఫౌండేషన్ చైర్మన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. యువతకు జయప్రద ఫౌండేషన్ వారు ఐటి, నాన్ ఐటి ల నుండి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సంకల్పంతో వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని జయప్రద ఫౌండేషన్ ఈ జాబ్ మేళా కార్యక్రమం ను జగ్గయ్యపేటలోని శుభమస్తు కళ్యాణమండపం నందు నిర్వహించింది. ఈ జాబ్ మేళాకు రెండు వేల మంది హాజరు కాగా వీరిలో నాన్ ఐటీ లో 1200 మంది హాజరు కాగా 800 మందికి, ఐటీలో 490 మంది హాజరు కాగా 490 మందినీ సెలెక్ట్ చేయడం జరిగింది. నాన్ ఐటి వారికి వెంటనే ఆఫర్ లెటర్ ఇవ్వగా ఐటి వారికి రెండవ దశలో ఇంటర్వ్యూ జరగనుంది. ఈనాటి కార్యక్రమంలో పాల్గొన్న తులసి సీడ్స్ అధినేత శ్రీరామచంద్ర ప్రభు మాట్లాడుతూ భవిష్యత్తుకు మార్గదర్శకులు విద్యా వైద్య రంగాలతో పాటు ఉపాధి రంగాలను కూడా యువతకు అవకాశాలను సృష్టిస్తూ ఈ ప్రాంతంలో జీవనోపాధికి ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తున్న తొండపు దశరథ జనార్ధన్ గారిని అభినందిస్తున్నానని యువత కూడా క్రమశిక్షణతో పట్టుదలతో అవకాశాలను అందుకోవాలని భవిష్యత్ తరాలకు మార్గదర్శకులుగా నిలవాలని తెలియజేసినారు. మాజీ మంత్రివర్యులు కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం మాట్లాడుతూ జనార్ధన్ గత సంవత్సరం కాలంగా అందిస్తున్న వైద్య సేవలతో పాటు ఉపాధి అవకాశాలను యువతకు అందించటం ఆయన చేస్తున్న కృషిని అభినందించినారు. శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య మాట్లాడుతూ జాబ్ మేళా ద్వారా యువతకు మరిన్ని అవకాశాలు అందిస్తున్నారని వారిని అభినందిస్తున్నానని యువత ఇలాంటి అవకాశాలను అందిపుచ్చుకోవాలని కోరినారు. ఈనాటి కార్యక్రమంలో తులసి సీడ్స్ ఎండి యోగేష్ విద్యా భారతి చైర్మన్ వెలగపూడి రామకృష్ణ బోడేపూడి అమర్ కావూరి శ్రీధర్ సిద్ధార్థ అకాడమీ ప్లేస్మెంట్ ఆఫీసర్, చెరుకూరి చాముండేశ్వరి తొండపురాజు వర్ధన్, గౌతమి సరోజ,ప్రోగ్రాం కోఆర్డినేటర్ కట్టా వెంకట నరసింహారావు చింతల సీతారామయ్య వడ్లమూడి రాంబాబు వివిధ హోదాలో ఉన్న నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు ఈనాటి కార్యక్రమానికి సేవలు అందించిన మండవ ఇంజనీరింగ్ కాలేజీ, అమ్మానీ కాలేజీ, లైఫ్ స్కిల్ కాలేజీ, జె ఆర్ సి కాలేజీ, విశ్వ భారతి కాలేజీ, ప్రిన్సిపల్సకు వాలంటీర్లుగా సేవలందించిన విద్యార్థిని విద్యార్థులకు జయప్రద ఫౌండేషన్ ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేసినారు.




# మట్టి విగ్రహాలనే పూజిద్దాం -- పర్యావరణాన్ని, సాంప్రదాయాలను కాపాడుకుందాం

### ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వద్దు.. పవిత్రమైన మట్టి గణపతే ముద్దు:

### జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్

### గత మూడేళ్లుగా నిరంతరం మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తున్న అఖండ ఫౌండేషన్

### జిల్లా ప్రజలకు, అధికారులకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన జిల్లా కలెక్టర్ అఖండ ఫౌండేషన్ అధ్యక్షులు విన్నకోట సురేష్

### మండపాల వద్ద డీజేలు, అపశబ్దాలకు దూరంగా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొల్పాలని జిల్లా కలెక్టర్ పిలుపు

**బాపట్ల : సెప్టెంబర్ 13 ( ప్రజా వీక్షణం )**



వినాయక చవితి వేడుకలను అత్యంత ఆనందోత్సాహాలతో పాటు పర్యావరణ హితంగా జరుపుకోవాలని,మన సనాతన సాంప్రదాయాలకు ప్రతి ఒక్కరూ పెద్దపీట వేయాలని బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. బాపట్ల ప్రసిద్ధ శ్రీ క్షీర భావనారాయణ స్వామి ఆలయం వద్ద ఆదివారం అఖండ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత మట్టి వినాయక ప్రతిమల పంపిణీ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షులు విన్నకోట సురేష్ కలెక్టర్‌ను ఘనంగా సన్మానించగా, ఆయన తన చేతుల మీదుగా భక్తులకు మట్టి వినాయక ప్రతిమలను అందజేసి ఈ సత్కార్యాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామాల్లోనూ, పట్టణాల్లోనూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా పూర్తిగా మట్టి విగ్రహాలను పూజించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పూర్వకాలం నుండి పసుపు, మట్టితో చేసిన గణనాథులను పూజించే ఆచారం మన సంస్కృతిలో భాగమని గుర్తుచేశారు. సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకుంటూ అత్యంత భక్తిశ్రద్ధలతో పండుగలను జరుపుకోవాలని సూచించారు. ప్రభుత్వం తరఫున వినాయక మండపాలకు ఉచిత విద్యుత్ సదుపాయం అందించబడుతుందని, నిర్వాహకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే, డీజేలు అధిక శబ్దంతో కూడిన సౌండ్ సిస్టమ్‌ల వల్ల ప్రజలకు, ముఖ్యంగా వృద్ధులు, విద్యార్థులకు కలుగుతున్న ఇబ్బందులను ప్రస్తావిస్తూ.. పరిమిత శబ్దంతో బాక్సులు ఏర్పాటు చేసుకుని భక్తి పాటలు, భజన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. మండపాల వద్ద దేవుడి పాటలకు బదులు ఇతర అసభ్యకర పాటలు వేయడం సముచితం కాదని, ఆధ్యాత్మిక వాతావరణం దెబ్బతినకుండా యువత ప్రత్యేక శ్రద్ధ వహించాలని హితవు పలికారు. పోలీసు శాఖ జారీ చేసిన నియమావళికి పూర్తిగా సహకరించి, పండుగ వేడుకల్లో గానీ, నిమజ్జన కార్యక్రమంలో గానీ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా ప్రశాంతంగా నిర్వహించుకోవాలని కలెక్టర్ కోరారు. చివరగా జిల్లా ప్రజలకు, ప్రభుత్వ అధికారులకు ఆయన వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. అఖండ ఫౌండేషన్ అధ్యక్షులు విన్నకోట సురేష్ మాట్లాడుతూ, గత మూడు సంవత్సరాలుగా అఖండ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను నిరంతరం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వాడకం వల్ల పర్యావరణం, జల వనరులు కలుషితమవుతాయని, అందుకే ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలనే పూజించి ప్రకృతిని పరిరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ.. అఖండ ఫౌండేషన్ సభ్యులు,బాపట్ల తాహశీల్దారు ఎస్.కె సలీమా, పట్టణ సీఐఆర్ రాంబాబు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నందిగామలో గణేష్ మండపాలు, నిమజ్జన ప్రదేశాల పరిశీలన: సీఐ పి. శ్రీను

**నందిగామ, సెప్టెంబర్ 13 (ప్రజా వీక్షణం)**

నందిగామ పట్టణం మరియు పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను సీఐ పి. శ్రీను ఆకస్మికంగా పరిశీలించారు. విద్యుత్ వైరింగ్, అగ్ని ప్రమాదాల నివారణ చర్యలు, భక్తుల రాకపోకలు, పార్కింగ్ ఏర్పాట్లపై ఉత్సవ కమిటీ సభ్యులతో చర్చించి తగు సూచనలు చేశారు.డీజేలు మరియు లౌడ్‌స్పీకర్లను ప్రభుత్వ నిబంధనల మేరకు మాత్రమే వినియోగించాలని స్పష్టం చేశారు. మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.అలాగే గణేష్ విగ్రహాల నిమజ్జన ప్రదేశాలను పరిశీలించి బారికేడింగ్, లైటింగ్ ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ మరియు పోలీసు బందోబస్తుపై సిబ్బందికి కీలక ఆదేశాలు జారీ చేశారు.అంతేకాకుండా మరి ముఖ్యం గా నిమజ్జన సమయంలో మద్యం సేవించి వాహనాలు నడపడం, గొడవలకు పాల్పడడం, ఇతరులకు ఇబ్బంది కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. వినాయక చవితి వేడుకలు మరియు నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో విజయవంతం చేయడానికి ప్రజలు, ఉత్సవ కమిటీలు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని సీఐ పి. శ్రీను విజ్ఞప్తి చేశారు.



# విఘ్నేశ్వరుని ఆశీస్సులతో గురజాల నియోజకవర్గం సుభిక్షంగా ఉండాలి....

### శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు

**గురజాల:సెప్టెంబర్ 13(ప్రజా వీక్షణం)**



గురజాల నియోజకవర్గ కుటుంబ సభ్యులందరికీ శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు వినాయక చవితి పండుగ శుభాకాంక్షలు ఘనంగా తెలియజేశారు. వినాయక చవితి పర్వదినం సందర్భంగా నియోజకవర్గ ప్రజలందరి జీవితాల్లో తొలగని వెలుగులు నిండాలని, ఆ విగ్నేశ్వరుడు ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరికి ఉండాలని, సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో అందరూ కూడా బాగుండాలని చెప్పి ఆయన మనసారా కోరుకున్నారు.ఈ సందర్భంగా ఎన్డీఏ ప్రభుత్వ గత రెండు సంవత్సరాల పాలనా విశేషాలను ఎమ్మెల్యే ప్రస్తావించారు. ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో అభివృద్ధి పరంగా ముందుకు వెళ్తూ, అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని కూడా ఈ ప్రభుత్వం పనిచేస్తా ఉందని ఆయన స్పష్టం చేశారు. సమాజంలోని ప్రతి ఒక్కరి అభ్యున్నతి కోసం తమ వంతు కృషి నిరంతరం కొనసాగుతుందని తెలిపారు.మునుముందు కూడా ప్రజలందరి అచంచలమైన ఆశీస్సులతో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్తామని యరపతినేని శ్రీనివాసరావు ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గ ప్రజలందరూ అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు.మరొక్క సారి ఆ విఘ్నేశ్వరుని ఆశీస్సులు మీకు అందరికీ ఉండాలని చెప్పి కోరుకుంటూ, గురజాల నియోజకవర్గ ప్రజలందరికీ మరియు కుటుంబ సభ్యులకు అందరికీ వినాయక చవితి పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని యరపతినేని శ్రీనివాసరావు తమ సందేశంలో పేర్కొన్నారు.

# లోక్ అదాలత్‌లో 8,288 కేసులు పరిష్కారం

### సైబర్ కేసుల్లో రూ.93.30 లక్షల రిఫండ్‌కు కోర్టు ఉత్తర్వులు

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 13 (ప్రజా వీక్షణం న్యూస్)**



వరంగల్ పోలీస్ కమిష నరేట్ పరిధిలో శనివారం నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌కు విశేష స్పందన లభించింది. రాజీకి అవకాశం ఉన్న 8,288 కేసులు పరిష్కార మయ్యాయి. వీటిలో 1,595 ఎఫ్ఐఆర్ కేసులు, 2,171 ఈ-పెట్టి కేసులు, 4,522 మోటార్ వెహికల్ చట్టం కేసులు, 134 సైబర్ కేసులు ఉన్నాయి.సైబర్ కేసుల్లో వివిధ బ్యాంకు ఖాతాల్లో నిలిపివేసిన రూ. 93,30,616 మొత్తా న్ని బాధితులకు అంద జేయాలని కోర్టు ఉత్తర్వు లు జారీ చేసింది. లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారాని కి కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని పోలీస్ కమిషన ర్ ఎన్. శ్వేత అభినందిం చారు. న్యాయవాదులు, కక్షిదారులు, న్యాయ సేవాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజావీక్షణం దినపత్రిక

GENERAL NEWS

14 సోమవారం సెప్టెంబర్ 2026

7

www.prajaveekshanam.in

# జనసేన పార్టీ పర్యావరణ పరిరక్షణతోనే అభివృద్ధి ప్రస్థానం

### భక్తితో పాటు ప్రకృతి పరిరక్షణకు పెద్దపీట

### మట్టి వినాయక ప్రతిమల ఉచిత పంపిణీ

**నందిగామ సెప్టెంబర్ 13 (ప్రజా వీక్షణం )**

నందిగామ నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ మరియు శ్రీ దుర్గా మల్లేశ్వరి స్వామి వార్ల దేవస్థాన ట్రస్ట్ బోర్డ్ మెంబర్ తంబళ్ళపల్లి రమాదేవి ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (అప్పసీబీ ) సభ్యులు డా" పంచకర్ల సందీప్ గారి సూచనలతో జనసేన పార్టీ 7వ సిద్ధాంతమైన పర్యావరణ పరిరక్షణతో కూడిన అభివృద్ధి ప్రస్థానంలో భాగంగా వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని నందిగామ పాక్స్ చైర్మన్ కొట్టె. హరికృష్ణ (బద్రి) ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు.పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు,భక్తి మరియు పర్యావరణ బాధ్యత రెండూ కలిసే ముందుకు సాగాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారుర సాయనాలతో తయారైన విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితం కాకుండా ఉండేందుకు మట్టి వినాయక ప్రతిమలను ప్రోత్సహించడం ద్వారా పర్యావరణహితమైన వినాయక చవితిని నిర్వహించాలనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా కొట్టె. హరికృష్ణ (బద్రి) మాట్లాడుతూ.. జనసేన పార్టీ సిద్ధాంతాలు కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా ప్రజల జీవితాల్లో ఆచరణలో కనిపించాలన్నదే జనసేన లక్ష్యమని అన్నారు. పండుగలను ఘనంగా నిర్వహించడంతో పాటు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారువినాయకుడిపై భక్తి మనసులో ఉండాలి.ప్రకృతిపై బాధ్యత మన చేతల్లో ఉండాలి.మట్టి వినాయకుడిని ప్రతిష్ఠిద్దాం. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం.అని ఆయన పిలుపునిచ్చారు.పర్యావరణ పరిరక్షణ, ప్రజా సంక్షేమం, సామాజిక బాధ్యత వంటి అంశాలను ముందుకు తీసుకెళ్లే కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు




# లోక్ అదాలత్‌లో సంచలన స్పందన: ఒకే రోజు 35 కేసులు పరిష్కారం!

### కంచికచర్ల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో సత్వర న్యాయం - ప్రభుత్వానికి జరిమానా జమ

**కంచికచర్ల, సెప్టెంబర్ 12 (ప్రజా వీక్షణం):**



ఎన్టీఆర్ జిల్లా నందిగామ కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్ ఎక్సైజ్ శాఖ పరిధిలో అత్యంత విజయవంతంగా ముగిసింది. కంచికచర్ల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న వివిధ చిన్నతరహా కేసులను న్యాయస్థానం ఇరువర్గాల అంగీకారంతో సత్వరమే పరిష్కరించింది. సుదీర్ఘ కాలం పాటు కోర్టుల చుట్టూ తిరిగే పనిలేకుండా, ఇరుపక్షాల సమ్మతితో కేసులు ముగియడంతో కక్షిదారులు ఊరట చెందారు.ఈ లోక్ అదాలత్‌లో మొత్తం 35 కేసులకు సంబంధించి జరిమానాలు కట్టి కేసులు తీసివేయడం జరిగిందని, జరిమాన మొత్తం 3,500 రూపాయలను ప్రభుత్వానికి చెల్లించడం జరిగిందని కంచికచర్ల ఎక్సైజ్ స్టేషన్ సి.ఐ. ఆశ్రఫున్నిసా బేగం తెలియజేశారు.ఈ సందర్భంగా సి.ఐ. ఆశ్రఫున్నిసా బేగం మీడియాతో మాట్లాడుతూ... లోక్ అదాలత్‌లు కక్షిదారులకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. కోర్టుల్లో కేసుల భారాన్ని తగ్గించడంతో పాటు, సామాన్య ప్రజలకు తక్కువ ఖర్చుతో సత్వర న్యాయం అందించడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. చిన్నపాటి ఎక్సైజ్ కేసులను సైతం కక్షిదారులు పరస్పర అంగీకారంతో పరిష్కరించుకోవడం అభినందనీయమని, భవిష్యత్తులో కూడా ఇలాంటి సద్వినియోగ వేదికలను ప్రజలు పూర్తిగా ఉపయోగించుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. న్యాయస్థానాల్లో పేరుకుపోతున్న కేసుల బారాన్ని తగ్గించడంలో లోక్ అదాలత్‌లు ఎంతగానో దోహదపడతాయని, ఇందులో వచ్చే తీర్పులు ఇరువర్గాల సంపూర్ణ అంగీకారంతో వెలువడతాయి కాబట్టి అప్పీళ్లకు తావు ఉండదని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దీనివల్ల ఇరువర్గాల మధ్య కాలయాపన తప్పుతుంది మరియు ఆర్థిక భారం కూడా గణనీయంగా తగ్గుతుంది. ఈ వార్త కంచికచర్ల ప్రాంతంలో విశేష చర్చనీయాంశమైంది.

# ఆర్. కృష్ణయ్యకు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు

### బీసీల హక్కులు, సంక్షేమం కోసం మరింతగా కృషి చేయాలని ఆకాంక్షించిన ఓబీసీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ దేవరకొండ రమాదేవి

**నందిగామ సెప్టెంబరు 13 (ప్రజా వీక్షణం )**

హైదరాబాద్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య 71వ పుట్టినరోజు సందర్భంగా ఓబీసీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ దేవరకొండ రమాదేవి ఆయనను హైదరాబాద్‌లోని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా దేవరకొండ రమాదేవి ఆర్. కృష్ణయ్యకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. బీసీ వర్గాల హక్కులు, సంక్షేమం, సామాజిక న్యాయం కోసం ఆర్. కృష్ణయ్య చేస్తున్న నిరంతర కృషి అభినందనీయమని రమాదేవి పేర్కొన్నారు.దేశవ్యాప్తంగా బీసీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, బీసీలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యం తదితర రంగాల్లో న్యాయం జరిగేలా ఆర్. కృష్ణయ్య చేస్తున్న కృషి ఎంతోమందికి స్ఫూర్తిదాయకమని ఆమె అన్నారు. బీసీల అభ్యున్నతి కోసం ఆయన చేస్తున్న పోరాటం భవిష్యత్ తరాలకు కూడా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.ఆర్. కృష్ణయ్య నాయకత్వంలో బీసీ సంక్షేమ ఉద్యమం మరింత బలోపేతం కావాలని, బీసీ వర్గాలకు మరింత సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం చేకూరాలని దేవరకొండ రమాదేవి ఆకాంక్షించారు. రాబోయే రోజుల్లో కూడా ఆయన మరింత ఉత్సాహంతో ప్రజా సేవ చేస్తూ, బీసీల సంక్షేమం కోసం అనేక విజయాలు సాధించాలని కోరుకున్నారు.ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్యకు మరోసారి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయనకు భగవంతుడు సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని దేవరకొండ రమాదేవి ప్రార్థించారు.



# టి. నర్సాపురం మండల పరిధిలో వినాయక చవితి వేడుకలపై కఠిన నిబంధనలు:

### డీజేలు, అశ్లీల నృత్యాలకు నో ఎంట్రీ -- ఎస్సై ఎమ్. జయబాబు హెచ్చరిక!

**టి. నర్సాపురం:సెప్టెంబర్ 13(ప్రజా వీక్షణం)**




ఏలూరు జిల్లా టి. నరసాపురం మండల పరిధిలో వినాయక చవితి వేడుకల ముసుగులో నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని టి. నర్సాపురం సబ్ ఇన్స్పెక్టర్ ఎమ్. జయబాబు స్పష్టం చేశారు. పండగ సంబరాలు భక్తిభావంతో, ప్రశాంతంగా సాగిపోవాలని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. పండగ ఆనందాన్ని పక్కన పెట్టి నిబంధన లకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టం తన పని తాను చేసుకుపోతుందని స్పష్టం చేస్తూ, మంచి ప్రవర్తనా నియమాలు ఉల్లంఘించే వారిపై బీఎన్ఎస్ఎస్ చట్టం కింద బైండ్ ఓవర్ కేసులు పక్కాగా అమలు చేస్తామని, జరిమానా విధించడంతో పాటు నేరుగా జైలుకు పంపుతామని ఎస్సై జయబాబు తెలిపారు.పర్యావరణ కాలుష్య నియంత్రణ మండలి నిబంధనల ప్రకారం వినాయక మండపాల వద్ద డీజే సౌండ్‌లు పెట్టడానికి ఎలాంటి అనుమతి లేదని, నిబంధనలు మీరితే స్పీకర్లను సీజ్ చేస్తామని స్పష్టం చేశారు.అలాగే ?ఉత్సవాల పేరుతో అశ్లీల నృత్యాలు నిర్వహిస్తే సహించే ప్రసక్తే లేదని, అలాంటి కార్యకలాపాలకు పాల్పడే వారిని వెంటనే అరెస్ట్ చేసి జైలు ఊచలు లెక్కించేలా చేస్తామని ఘాటుగా హెచ్చరించారు.శాంతి, క్రమశిక్షణ, బాధ్యతతో పండగను నిర్వహించుకుని ఏలూరు జిల్లాను సురక్షితంగా, ప్రశాంతంగా ఉంచేందుకు ప్రజలంతా పోలీసు శాఖకు పూర్తి సహకారం అందించాలని ఎస్సై ఎమ్. జయబాబు కోరారు.

# సీనియర్ జర్నలిస్టు కాసుల ప్రవీణ్ మాతృమూర్తికి ముద్దం నర్సింహా యాదవ్ నివాళులు

**బాలానగర్ : సెప్టెంబర్ 13 (ప్రజా వీక్షణం)**

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మూసా పేట సర్కిల్ బాలానగర్ డివిజన్ పరిధిలోని రాజు కాలనీకి చెందిన పత్రిక విలఖరి ప్రవీణ్ మాతృమూర్తి మృతి చెందిన విషయం తెలుసుకున్న ఓల్డ్ బోయిన్‌పల్లి మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహా యాదవ్ వారి నివాసానికి వెళ్లి పార్థివదేహాన్ని సందర్శిచి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ప్రవీణ్ కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మాతృమూర్తిని కోల్పోవడం కుటుంబానికి తీరని లోటని, ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని ఆయన అన్నారు.మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని ముద్దం నర్సింహా యాదవ్ ప్రార్థించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో సత్యపాల్, గడ్డం నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.



# డివిజన్ పరిధిలో స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

### -- ఎల్‌బీనగర్ వాసులకు ముద్దం నర్సింహా యాదవ్ హామీ..

**బోయినపల్లి; సెప్టెంబర్ 13 (ప్రజా వీక్షణం)**

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ బోయినపల్లి సర్కిల్ పరిధిలోని ఎల్‌బీనగర్ ప్రాంతంలో నెలకొన్న స్థానిక సమస్యలను పరిష్క రించేందుకు తన వంతు కృషి చేస్తానని ఓల్డ్ బోయిన్‌పల్లి మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహా యాదవ్ హామీ ఇచ్చారు. ఎల్‌బీనగర్‌కు చెందిన పలువురు స్థానికులు ముద్దం నర్సింహా యాదవ్‌ను కలిసి తమ ప్రాంతంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా స్థానికులు తమ ప్రాంతంలో నెలకొన్న మౌలిక వసతుల లోపాలు, ప్రజలకు నిత్యం ఇబ్బందులు కలిగిస్తున్న స్థానిక సమస్యలు తదితర అంశాలను ఆయనకు వివరించారు. సమస్యల కారణంగా స్థానిక ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరించి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కోరారు. స్థానికులు వివరించిన సమస్యలను ముద్దం నర్సింహా యాదవ్ సావధానంగా విన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అధికారులతో మాట్లాడి, సమస్యల తీవ్రతను వారి దృష్టికి తీసుకెళ్లి అవసరమైన చర్యలు చేపట్టేలా కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా స్థానిక సమస్యలను ఎప్పటికప్పుడు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, పరిష్కారం లభించే వరకు తన వంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తానని, స్థానికుల అవసరాలకు అనుగుణంగా అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ముద్దం నర్సింహా యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో లూయిస్ -- అధ్యక్షుడు, నిరంజన్ -- ఉపాధ్యక్షుడు, సతీష్ -- ప్రధాన కార్యదర్శి, సింహం -- సంయుక్త కార్యదర్శి, వేణు -- కోశాధికారి, రమేశ్వర్, శంకరయ్య, ఆర్. సంతోష్, ఎన్. సంతోష్, ఉమాపతి, శంకర్ గౌడ్, సురేష్ తదితర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



# మట్టి వినాయకుడినే పూజిద్దాం.. ప్రకృతిని కాపాడుకుందాం

### - భక్తి శ్రద్ధలతో నవ దినాలు జరుపుకుందాం - సందెల రాజు, (జర్నలిస్ట్)



**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 13**

**(ప్రజా వీక్షణం న్యూస్)**

వినాయక చవితి పర్వది నాన్ని భక్తి శ్రద్ధలతో, పర్యా వరణహితంగా నిర్వహించుకోవాలని జర్నలిస్ట్ సందెల రాజు ప్రజలకు పిలుపునిచ్చారు. వినాయ క నవరాత్రుల సందర్భంగా ప్రతి ఒక్కరూ మట్టి వినా యక విగ్రహాలను ప్రతిష్ఠిం చి పూజించాలని సూచిం చారు. ప్రకృతిని పరిరక్షిం చాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో తయారు చేసిన విగ్రహా ల వల్ల నీటి వనరులు కలుషితమయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. మట్టి వినాయక విగ్రహాలను ఉపయోగించడం ద్వారా పర్యా వరణానికి మేలు చేయడం తో పాటు మన సంప్రదాయాలను కాపాడిన వార మవుతామని తెలిపారు.వినాయక నవరాత్రులను తొమ్మిది రోజుల పాటు భక్తి, ఆధ్యాత్మికత, సామా జిక బాధ్యతతో నిర్వహిం చాలని కోరారు. పూజా కార్యక్రమాలతో పాటు పరిసరాల పరిశుభ్రత, మొక్కల సంరక్షణ, ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.వినాయకుడి పూజతో పాటు ప్రకృతి పరిరక్షణకు కూడా ప్రాధాన్యతనిస్తూ “మట్టి వినాయ కుడినే పూజిద్దాం.. ప్రకృతి ని కాపాడుకుందాం” అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని సందెల రాజు కోరారు. పర్యావరణహితమైన వినాయక చవితి వేడుకల ను నిర్వహించి సమాజా నికి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు.

ప్రజావీక్షణం దినపత్రిక

# కోడి పందేలపై బెజ్జూర్ పోలీసుల కొరడా..

## కత్తులు కట్టి పందేలు.. పది మంది అరెస్ట్..

## 3 కోళ్లు, 3 కత్తులు, రూ.500 నగదు స్వాధీనం..

సిర్పూర్ కాగజ్నగర్ ప్రతినిధి: సెప్టెంబరు 13 (ప్రజావీ క్షణం న్యూస్ )

కొమురం భీమ్ అసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలం కోడి పందేల నిర్వహణపై బెజ్జూర్ పోలీసులు కొరడా ఝళిపించారు. మండలంలోని మొుంజంపల్లి గ్రామ శివారులో సమ్మక్క--సారలమ్మ గుడి సమీపంలో కోడి పందేలు నిర్వహిస్తున్న పది మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి మూడు కోళ్లు, మూడు కత్తులు, రూ.500 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం సాయంత్రం 5:30 గంటల సమయంలో ముంజంపల్లి గ్రామ శివారులో కోడి పందేలు జరుగుతున్నాయన్న విశ్వసనీయ సమాచారం పోలీసులకు అందింది. కౌటాల సీఐ సంతోష్ కుమార్, ఆదేశాల మేరకు బెజ్జూర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్-1787 ఎస్. సమ్మయ్య, హెడ్ కానిస్టేబుల్-2264 జె. ఉమేష్, కానిస్టేబుల్ మహేందర్ సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని దాడి నిర్వహించారు. పోలీసులు దాడి చేసే సమయానికి కొందరు వ్యక్తులు కోళ్ల కాళ్లకు కత్తులు కట్టి పందేలు నిర్వహిస్తూ, నగదు బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్లు గుర్తించారు. వెంటనే పది మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద ఉన్న మూడు కోళ్లు, మూడు కత్తులు, రూ.500 నగదును స్వాధీనం చేసుకున్నారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. కోడి పందేలు, జూదం, బెట్టింగ్‌తో పాటు ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలపై నిరంతరం నిఘా కొనసాగుతుందని స్పష్టం చేశారు. చట్టాన్ని ఉల్లంఘించి కోడి పందేలు, జూదం నిర్వహించే వారిపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని, చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. ప్రజలు కూడా ఇలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు.



# గోమాతకు జాతీయ మాత హోదా కల్పించాలి....

## గోరక్షణ కోసం సంతకాల సేకరణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి..

## కేశవనాథ్, కంచికోట హనుమాన్ ఆలయాల్లో స్వామీజీ పిలుపు..

సిర్పూర్ కాగజ్ నగర్ ప్రతినిధి: సెప్టెంబరు 13 (ప్రజా వీక్షణం న్యూస్ )

గోమాతకు జాతీయ మాత హోదా కల్పించడంతో పాటు గో హత్యను అరికట్టేందుకు చేపడుతున్న గో సమ్మాన్ అభియాన్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని స్వామీజీ పిలుపునిచ్చారు. ఆదివారం ఆసిఫాబాద్ బ్రహ్మనవాడలోని కేశవనాథ్ ఆలయం, కంచికోట హనుమాన్ ఆలయంలో నిర్వహించిన కార్యక్రమాల్లో గోభక్తులు, గోప్రేమికులు, సనాతన ధర్మాభిమానులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ.. గోమాతకు జాతీయ మాత హోదా కల్పించడంతో పాటు గో హత్యను అరికట్టేందుకు సమాజం సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో గోమాతకు ప్రత్యేకమైన స్థానం ఉందని, గోరక్షణను కేవలం ఒక వర్గానికి సంబంధించిన అంశంగా కాకుండా సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ చూడాలని సూచించారు .గోమాత రక్షణ కోసం కొనసాగుతున్న గో సమ్మాన్ అభియాన్‌లో భాగంగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించాలని ఆయన కోరారు. రాష్ట్రపతి, ప్రధానమంత్రి, తెలంగాణ ముఖ్యమంత్రికి ప్రజల ఆకాంక్షను తెలియజేసేలా గోభక్తులు, గోప్రేమికులు సంతకాల కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. “ఇప్పుడే మనం మేలుకోకపోతే భవిష్యత్ తరాలకు గోమాతను కాపాడటం మరింత కష్టమవుతుంది. మన పిల్లలు గోమాతను ప్రత్యక్షంగా చూడకుండా గూగుల్‌లో ఆవు ఎలా ఉంటుందో వెతికి చూపించే పరిస్థితి రాకూడదు. గోమాతతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి” అని స్వామీజీ అన్నారు. ప్రతి ఒక్కరూ ఒక ఫారం తీసుకుని 59 మంది గోప్రేమికుల సంతకాలను మొబైల్ నంబర్లతో సహా సేకరించి అందించాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యంతో సంతకాల సహా సేకరించి అందించాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యంతో సంతకాల సేకరణను విస్తృతం చేస్తే గోమాత రక్షణకు సంబంధించిన ప్రజల అభిప్రాయాన్ని ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లవచ్చని తెలిపారు.ఈ సందర్భంగా కేశవనాథ్ ఆలయ ప్రధాన పూజారి నరేశ్ కార్యక్రమంలో పాల్గొని గోమాత రక్షణ కోసం చేపడుతున్న సంతకాల సేకరణకు సంబంధించిన పత్రాలు, పాంప్లెట్లను స్వీకరించారు. గోమాత రక్షణ కార్యక్రమానికి తన మద్దతును తెలిపారు .అనంతరం స్వామీజీ, ఆయన శిష్యులను కాలనీవాసులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. గోమాత రక్షణ కోసం చేపడుతున్న కార్యక్రమాలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని వారు తెలిపారు.కార్యక్రమంలో ఖాండ్రే విశాల్, ప్రవీణ్ దేశ్‌ముఖ్, సువర్ణ, స్వప్న, సంతోష్, మంత్రిని, సాయి, కృష్ణ, మసాదే, రాయేశ్వర్‌రావు మసాదే తదితరులతో పాటు కాలనీవాసులు, గోభక్తులు, గోప్రేమికులు పాల్గొన్నారు.గోమాత రక్షణ కోసం చేపడుతున్న సంతకాల సేకరణ కార్యక్రమానికి ప్రజల నుంచి విస్తృత స్పందన లభించడంతో.. ఈ ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా భాగస్వాములు కావాలని నిర్వాహకులు కోరారు.



# ఆరేళ్ల బాలికపై అత్యాచారం.. కాగజ్‌నగర్‌లో కలకలం....

## మేనమామపై తీవ్ర ఆరోపణలు.. నిందితుడిపై ఆగ్రహంతో కాలనీవాసుల నిరసన..

## ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు.. అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు....

సిర్పూర్ కాగజ్ నగర్ ప్రతినిధి: సెప్టెంబరు 13 (ప్రజా వీ క్షణం న్యూస్)

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని అశోక్ కాలనీ (రైల్వే స్టేషన్)లో ఆరేళ్ల మైనర్ బాలికపై అత్యాచారం జరిగిన ఘటన తీవ్ర కలకలం రేపింది. బాలికకు మేనమామగా పేర్కొంటున్న మామిడి శశిధర్ ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటన విషయం తెలుసుకున్న కాలనీవాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితుడిపై దాడికి ప్రయత్నించడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసు అధికారులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. డీఎస్పీ వహీయొద్దీన్, సీఐ ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ఘటన స్థలంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పరిస్థితిని పర్యవేక్షించారు. చిన్నారిపై జరిగినట్లు ఆరోపణలు వచ్చిన ఈ దారుణ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను దర్యాప్తు అనంతరం వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.మైనర్ బాలికపై లైంగిక నేరానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. బాలిక భద్రత, గోప్యతను కాపాడుతూ పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



# ప్రజల్లో సేవా గుణం మరింత పెంపొందాలి: ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి

## హేలాపురి ఆర్ష సేవా సమితి ఆధ్వర్యంలో నిరుపేద వృద్ధులకు పింఛన్ల పంపిణీ

## సంస్థ సేవా నిరతి ఎంతో ఆదర్శప్రాయం: ఎమ్మెల్యే ప్రశంస

ఏలూరు, సెప్టెంబర్ 13:(ప్రజా వీక్షణం)

సమాజంలోని అవసరార్థులకు సాయం అందించేందుకు ప్రజల్లో సేవా గుణం మరింత పెంపొందాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అభిప్రాయపడ్డారు. పాతతరం రాజకీయ నాయకుల అనుభవాలను స్ఫూర్తిగా తీసుకుని, తాను తన పరిధిలో సేవా కార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా దాతల సహకారంతో వాటిని మరింత ముందుకు తీసుకువెళ్తున్నట్లు తెలిపారు.ఏలూరు రామచంద్రరావు పేట మాగంటి వారి వీధిలోని హేలాపురి ఆర్ష సేవా సమితి కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొనగా, తొలుత ఆయనకు ఆత్మీయ స్వాగతం లభించింది. ఈ సందర్భంగా ప్రతినెలా 50 మంది నిరుపేదలకు రూ. 500 చొప్పున పింఛన్ మొత్తాన్ని అందజేస్తున్న సమితి సేవా నిరతిని ఎమ్మెల్యే కొనియాడారు. ప్రజల్లో సేవా గుణం పెంపొందినప్పుడే అవసరార్థులకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు.ప్రస్తుత పరిస్థితుల్లో రాజకీయాల్లోకి రావాలనుకోవడం అంత శ్రేయస్కరం కాదని, ప్రశాంతతను కోల్పోవాల్సి వస్తుందని ఆయన హితవు పలికారు. అనుకోని పరిస్థితుల్లో రాజకీయాల్లోకి వచ్చిన తాను, తన తండ్రి బడేటి శ్రీహరిరావు వంటి వారిని చూసి నేర్చుకున్న కొన్ని విషయాలను పరిగణలోకి తీసుకుని ప్రజలకు సేవ చేయాలన్న దృక్పథంతో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. ప్రతి గురువారం తన క్యాంపు కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి, ఎన్నో వైద్య పరీక్షలతో పాటు అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. దీనికి తనకు ఎంతో మంది దాతల సహకారం కూడా అందుతోందన్నారు.భవిష్యత్తు తరాలను దృష్టిలో ఉంచుకుని ఏలూరు పవర్‌పేట రైల్వేగేటు స్థానంలో బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం



చుట్టినట్లు పేర్కొన్నారు. గతంలో ఏలూరు నగరం కాలుష్య కాసారంగా ఉండేదని, గత కొన్ని నెలలుగా తాము తీసుకున్న చర్యల కారణంగా ప్రస్తుతం జాతీయ స్థాయిలో పొల్యూషన్ తక్కువగా ఉన్న నగరాల్లో 4వ స్థానాన్ని సాధించడం తనకెంతో ఆత్మసంతృప్తి కలిగించిందని చెప్పారు. ఆర్ష సేవా సమితి భవిష్యత్తులో చేపట్టే అన్ని కార్యక్రమాలకు తన సంపూర్ణ సహకారం ఉంటుందని హామీనిచ్చారు.అనంతరం ఎమ్మెల్యే బడేటి చంటితో పాటు ప్రముఖ సంగీత విద్వాంసురాలు, నాట్యాచారిణి మైలవరపు వెంకట దివ్యభారతిలను సమితి తరపున ఘనంగా సన్మానించారు. ఆ తర్వాత పేద వృద్ధులకు నెలవారీ పింఛన్లను ఎమ్మెల్యే బడేటి చంటి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ష సేవా సమితి వ్యవస్థాపకులు మంత్రిప్రగడ శ్రీహరిరావు, వినియోగదారుల ఫోరం జడ్జి ద్రోణంరాజు కోదండరామ్, జాతీయ బ్రాహ్మణ ఫెడరేషన్ ఉపాధ్యక్షులు సత్యవాడ దుర్గాప్రసాద్, ఆర్ష సేవా సమితి అధ్యక్షులు నేతి వెంకట్రామయ్య, ప్రధాన కార్యదర్శి భోగరాజు శ్రీనివాస ఫణి ప్రసాద్, కోశాధికారి మేడిచర్ల జయప్రకాష్, ఉపాధ్యక్షులు పాలంకి దుర్గా ప్రభాకరం, పోడూరి కనకదుర్గ, సహాయ కార్యదర్శి వారణాసి సత్యనారాయణ, కందాడై రంగనాయకి తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలో కళకళ.. తెలంగాణలో విలవిల

తెలంగాణలో కాంగ్రెస్ గద్దెనెక్కింది మొదలు కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులపై ఆంధ్రా పెత్తనం చెలాయిస్తున్నది. రాష్ట్ర రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టి రేవంత్ సర్కార్ ఏపీకి నీటిని ధారాదత్తం చేసింది. కేఆర్ఎంబీ ఆదేశాలను తుంగలో తొక్కి.. శ్రీశైలం నిండకుండా అడ్డుపడి.. పోతిరెడ్డిపాడు నుంచి పక్కరాష్ట్రం యథేచ్ఛగా నీటిని మళ్లించుకుంటున్నా.. దౌర్జన్యంగా సాగర్ కుడికాలువ నుంచి జలాలను తరలిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం చేష్టలుడిగి చూస్తున్నది. కృష్ణా నది కింద ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా నున్న గ్రామంలో పచ్చగా ఉన్న పంట పొలాలు.వెయ్యి రోజుల పాలనలో కాంగ్రెస్ సాధించిన ఘనతకు నిదర్శనమిది.. బీఆర్ఎస్ హయాంలో పచ్చని పంటలతో కళకళలాడిన తెలంగాణ రెండున్నరేండ్లుగా ఏడారై ఏడుస్తున్నది. ఇదే కృష్ణానది నుంచి నీటిని ఎత్తిపోయకుండా రేవంత్ సర్కార్ ఆడుతున్న రాజకీయ చదరంగంలో రాష్ట్ర రైతులే పావులుగా మారుతున్నారు. పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల్లో నాలుగు మోటర్లు సిద్ధంగా ఉన్నా పడావు పెట్టి నీటిని ఎత్తకుండా మొండి‘చెయ్యి’ చూపుతున్న ప్రభుత్వ నిర్వాకంతో వనపర్తి జిల్లా దవాచుపల్లిలో వానకాలంలోనే ఎండుముఖం పట్టిన వరిపొలమిది.

# ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ స్వామీజీ పాదాలకు నమస్కరించారా?.. అసలు విషయం చెప్పిన ఇరాన్ ఎంబసీ

## - హిందూ గురువు ఎదుట ఇరాన్ అధ్యక్షుడు వంగిన వీడియో వైరల్ - కాళ్లకు నమస్కరించారంటూ సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం - ఆ ప్రచారాన్ని ఖండించిన ఇరాన్ రాయబార కార్యాలయం - కిందపడిన లేఖను తీసుకునేందుకే వంగారని స్పష్టీకరణ - బ్రిక్స్ సదస్సు కోసం ఢిల్లీ వచ్చినప్పుడు ఈ ఘటన చోటుచేసుకుంది

ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ఒక హిందూ ఆధ్యాత్మిక గురువు ముందు వంగి పాదాలకు నమస్కరిస్తున్నట్లు ఉన్న ఒక వీడియో సోషల్ మీడియాలో తీవ్ర దుమారం రేపింది. అయితే, ఈ ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని, అది పూర్తిగా వక్రీకరించిన వీడియో అని ఢిల్లీలోని ఇరాన్ రాయబార కార్యాలయం స్పష్టం చేసింది. ఈ ఘటనపై పూర్తి వివరణ ఇస్తూ, దీని వెనుక జరిగిన అసలు విషయాన్ని వెల్లడించింది.వివరాల్లోకి వెళితే, 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ భారత్‌లో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా, న్యూఢిల్లీలోని ఒబెరాయ్ హోటల్‌లో ఇరాన్ రాయబారి ఏర్పాటు చేసిన ప్రత్యేక విందులో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి పలువురు భారతీయ ఆధ్యాత్మికవేత్తలు, మేధావులు, వ్యాపార ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా, ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్ ప్రేమేశ్వర్ ధామ్ పీఠాధిపతి జగద్గురు స్వామి సతీశాచార్య మహారాజ్‌తో అధ్యక్షుడు సమావేశమయ్యారు.ఈ భేటీ సమయంలో, స్వామి చేతిని పట్టుకున్న పెజెష్కియాన్ ఒక్కసారిగా కిందకు వంగారు. ఈ దృశ్యాలున్న వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఇరాన్ అధ్యక్షుడు హిందూ గురువు పాదాలకు నమస్కరించి ఆశీస్సులు తీసుకున్నారంటూ పలువురు నెటిజన్లు పోస్టులు పెట్టారు.అయితే, ఈ ప్రచారాన్ని ఇరాన్ రాయబార కార్యాలయ వర్గాలు తీవ్రంగా ఖండించాయి. అది పాద నమస్కారం కాదని, ఆ సమయంలో ఒకరు అధ్యక్షుడికి అందించిన లేఖ కింద పడిపోయిందని, దాన్ని తీసుకునేందుకే ఆయన కిందకు వంగారని స్పష్టం చేశాయి. ఈ చిన్న సంఘటనను వీడియో తీసి, దానిని సందర్భం నుంచి వేరుచేసి తప్పుగా ప్రచారం చేస్తున్నారని ఆ వర్గాలు ఆరోపించాయి. మరోవైపు, ఈ భేటీపై స్వామి సతీశాచార్య తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తూ, సనాతన ధర్మం, శాంతియుత సహజీవనం గురించి అధ్యక్షుడితో చర్చించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పతంజలికి చెందిన ఆచార్య బాలకృష్ణ, మీర్వాయిజ్ ఉమర్ ఫరూఖ్ వంటి ప్రముఖులు కూడా పాల్గొన్నట్లు సమాచారం. మొత్తం మీద, బ్రిక్స్ సదస్సు వేళ జరిగిన ఈ సాధారణ సమావేశం, ఒక వీడియో క్లిప్ కారణంగా అనూహ్యంగా వివాదాస్పదమైంది.

Printed & published owned by K.SRAVAN KUMAR. Printed Published RK PRINTING PRESS at 6-1-948 Boyawada Street Nalgonda.Pin : 508001. Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. RNI.NO.APTEL/2009/29433.(CELL ) 9866330400 prajaveekshanam@gmail.com

# ఫొటోలు, వీడియోల కోసం హత్య!

**ఆర్థిక ఇబ్బందులతో బెదిరింపులకు పథకం.. అడ్డొచ్చిన గిరిధర్‌ను కత్తితో హతమార్చిన నిందితులు**

**సీసీ కెమెరాలు, సాంకేతిక ఆధారాలతో ఇద్దరి అరెస్టు.. కత్తి, రక్తపు మరకల దుస్తులు, సెల్‌ఫోన్లు స్వాధీనం**

**కాకినాడ, సెప్టెంబర్ 13 ( ప్రజా వీక్షణం విలేఖరి):**

అసభ్యకరమైన ఫొటోలు, వీడియోలను అడ్డుపెట్టుకుని డబ్బులు సంపాదించాలన్న దురాలోచన ఓ వ్యక్తి హత్యకు దారితీసింది. ఫొటోలు, వీడియోలను తీసుకునే క్రమంలో జరిగిన ఘర్షణలో గండి గిరిధర్‌ను కత్తితో దాడి చేసి హతమార్చిన ఇద్దరు నిందితులను కాకినాడ త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసు వివరాలను కాకినాడ జిల్లా అదనపు ఎస్పీ, ఇన్‌చార్జి డీఎస్పీ డాక్టర్ మహంతి కిషోర్‌కుమార్ ఆదివారం డీఎస్పీ కార్యాలయంలో వెల్లడించారు. సాంబమూర్తి నగర్ ఇందిరా కాలనీ సెవెన్‌హిల్స్ రోడ్డులో నివాసం ఉంటున్న గండి గిరిధర్ ఈ నెల 2న తన ఇంట్లోనే హత్యకు గురయ్యాడు. మృతుడి తల్లి గండి జయలక్ష్మి ఫిర్యాదు మేరకు త్రీటౌన్ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కేవీఎస్ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ కేసును ప్రత్యేకంగా పర్యవేక్షిస్తూ నిందితులను త్వరగా గుర్తించి అరెస్టు చేయాలని ఆదేశించారు. దీంతో ప్రత్యేక క్రైమ్ బృందాలను ఏర్పాటు చేసి సీసీ కెమెరాల ఫుటేజ్‌తో పాటు సాంకేతిక, ప్రత్యక్ష, పరోక్ష ఆధారాలను విశ్లేషించారు. ఈ క్రమంలో ఈ నెల 12న పాలేపు వివేక్ అలియాస్ బన్నీ (18), ఏలూరి రామకృష్ణ (21)లను అరెస్టు చేశారు.పోలీసుల దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. గతంలో వివాహం జరిగి భార్యతో విభేదాల కారణంగా విడాకులు తీసుకున్న గిరిధర్ ప్రస్తుతం తల్లితో కలిసి ఉంటున్నాడు. అతని సెల్‌ఫోన్‌లో పరిచయమున్న కొంతమంది మహిళలకు సంబంధించిన అసభ్యకరమైన ఫొటోలు, వీడియోలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. గిరిధర్‌తో సన్నిహితంగా ఉండే బన్నీ, రామకృష్ణలకు వాటిని చూపించినట్లు దర్యాప్తులో తేలింది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నిందితులు ఆ ఫొటోలు, వీడియోలను గిరిధర్ నుంచి తీసుకుని, వాటిలో ఉన్న మహిళల కుటుంబ సభ్యులను బెదిరించి డబ్బులు వసూలు చేయాలని పథకం వేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో ఈ నెల 1న రాత్రి గిరిధర్ తల్లి, పక్క పోర్షన్‌లో ఉండే అతని అన్నయ్య కుటుంబ సభ్యులు ఇంట్లో లేరని తెలుసుకుని, అర్ధరాత్రి 12.15 గంటల సమయంలో నిందితులు గిరిధర్ ఇంటికి వెళ్లారు. ఫొటోలు, వీడియోల విషయమై అతనితో గొడవకు దిగారు. ముందుగానే వెంట తెచ్చుకున్న కత్తితో గిరిధర్ కంఠం, భుజంపై విచక్షణారహితంగా దాడి చేయడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు వెల్లడించారు. హత్య అనంతరం నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. దర్యాప్తులో సేకరించిన సీసీ కెమెరా ఫుటేజ్, సాంకేతిక ఆధారాలు, ఇతర సాక్ష్యాలను సమగ్రంగా విశ్లేషించడంతో పాటు



నిందితులను విచారించగా హత్యలో వారి ప్రమేయం నిర్ధారణ కావడంతో అరెస్టు చేసినట్లు అదనపు ఎస్పీ తెలిపారు. నిందితుల నుంచి హత్యకు ఉపయోగించిన కత్తి, ఘటన సమయంలో ధరించిన రక్తపు మరకలున్న దుస్తులు, నాలుగు సెల్‌ఫోన్లు, ఒక పెన్‌తో పాటు హత్య అనంతరం గిరిధర్ నుంచి తీసుకెళ్లిన సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటిని తదుపరి శాస్త్రీయ పరీక్షలు, చట్టపరమైన ప్రక్రియ కోసం భద్రపరిచినట్లు పోలీసులు తెలిపారు. కేసులో మరిన్ని సాక్ష్యాల సేకరణ, సాంకేతిక ఆధారాల విశ్లేషణ కొనసాగుతున్నట్లు చెప్పారు. కేసును సవాలుగా తీసుకుని తక్కువ సమయంలోనే నిందితులను గుర్తించి అరెస్టు చేసిన త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ కేవీఎస్ సత్యనారాయణ, ఎస్ఐలు జీవీవీఎస్ చౌదరి, వి.ఆంజనేయరాజు, హెడ్‌కానిస్టేబుల్ సతీష్, కానిస్టేబుళ్లు మురళీరాజు, బి.శ్రీనివాసరావు, ప్రేమ్‌కుమార్, క్రైమ్ సిబ్బందిని ఎస్పీ జి.బిందుమాధవ్ అభినందించారు.

# హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ రద్దుకు సీఎం చంద్రబాబు ఆదేశం!

**అమరావతి, సెప్టెంబర్ 13 ( ప్రజా వీక్షణం విలేకరి):**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గతంలో ప్రవేశపెట్టిన హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో కొత్త పెన్షన్ల మంజూరు ప్రక్రియ ప్రారంభం కాకముందే ఈ రద్దు ప్రక్రియను పూర్తి చేయాలని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ రికార్డుల్లో కుటుంబ సభ్యుల వివరాలను ఒకే యూనిట్‌గా అనుసంధానించే ఈ మ్యాపింగ్ విధానం వల్ల... కొత్త రేషన్ కార్డులు, పెన్షన్లు, ఇళ్లు మరియు ఇతర సంక్షేమ పథకాల లబ్ధి కోసం ప్రజలు తమ ఉమ్మడి కుటుంబాల నుండి విడిపోవాల్సి వస్తోందని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనలు ఎట్టిపరిస్థితుల్లోనూ కుటుంబాలను విడదీసేలా ఉండకూడదని, సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవయ్యేలా నిబంధనలను మరింత సరళతరం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ నిర్ణయం ద్వారా ఉమ్మడి కుటుంబ వ్యవస్థను కాపాడటంతో పాటు, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ పథకాలు అందుతాయని ప్రభుత్వం పేర్కొంది.




# అభివృద్ధికి గుర్తింపు.. పిల్లి దంపతులకు జన నీరాజనం!”




**“3వ డివిజన్‌లో ‘ఇంటింటికీ టీడీపీ’కి ఘన స్పందన..**

**తీన్మార్ మోత.. బాణాసంచా హోరు..**

**గజమాలలు, హారతులతో అపూర్వ స్వాగతం..**

**ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకం**

**కాకినాడ రూరల్, సెప్టెంబర్ 13 ( ప్రజా వీక్షణం విలేఖరి):**

గతంలో చేపట్టిన అభివృద్ధి పనులను గుర్తుచేస్తూ.. ప్రస్తుత సమస్యలను పరిష్కరించాలంటూ ప్రజలు కోరుతూ.. కాకినాడ రూరల్ నియోజకవర్గ పరిధిలోని కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ 3వ డివిజన్‌లో ‘ఇంటింటికీ తెలుగుదేశం’ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. టీడీపీ కాకినాడ రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి దంపతులకు స్థానికులు, పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. తీన్మార్ వాయిద్యాల మోత.. భారీగా బాణాసంచా కాల్పులతో డివిజన్‌లో సందడి నెలకొంది. టీడీపీ సీనియర్ నాయకుడు యాళ్ల రాజా ఆధ్వర్యంలో నిర్వహించిన స్వాగత కార్యక్రమంలో మహిళలు హారతులు ఇవ్వగా, పార్టీ నాయకులు, కార్యకర్తలు పిల్లి దంపతులను గజమాలలతో



సత్కరించారు. అనంతరం వారిని వాయిద్యాల నడుమ ఊరేగింపుగా కార్యక్రమ ప్రదేశానికి తీసుకెళ్లారు. తర్వాత పిల్లి దంపతులు ఇంటింటికీ వెళ్లి ప్రజలను నేరుగా కలుసుకున్నారు. కుటుంబాల యోగక్షేమాలను అడిగి తెలుసుకోవడంతో పాటు స్థానికంగా నెలకొన్న సమస్యలు, అవసరమైన అభివృద్ధి పనులపై వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా పలువురు స్థానికులు పిల్లి అనంతలక్ష్మి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో డివిజన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను గుర్తుచేశారు. అప్పట్లో జరిగిన పనులు తమకు ఇప్పటికీ ఉపయోగపడుతున్నాయని పేర్కొంటూ, ప్రస్తుతం చేపట్టాల్సిన పలు పనులను వారి దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలతో నేరుగా మమేకమైన పిల్లి దంపతులు వారి సమస్యలను సావధానంగా విన్నారు. పరిష్కరించాల్సిన అంశాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరగా పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అదే సమయంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమానికి లభించిన స్పందనపై పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి దంపతులు మాట్లాడుతూ తమపై స్థానికులు చూపిన ఆత్మీయత, అభిమానం మరువలేనివని అన్నారు. ప్రజలతో ప్రత్యక్షంగా కలుసుకుని వారి అవసరాలు తెలుసుకోవడమే ‘ఇంటింటికీ తెలుగుదేశం’ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పిల్లి కృష్ణ ప్రసాద్ (బుజ్జి), టీడీపీ నాయకులు కాళ్ల శ్రీనివాస్, భద్రం, లోవరాజు, ప్రసాద్, సుబ్రమణ్యం, రాము, రాజు, శేఖర్, రాజారావు, శ్రీను, గణేష్, సత్తిబాబు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# యూత్ సండే వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్

**నర్సాపురం సెప్టెంబర్ 13 ప్రజా వీక్షణం విలేకరి**

నరసాపురం స్థానిక కప్పలపేటలోని సెయింట్ జాన్స్ లూథరన్ దేవాలయంలో నిర్వహించిన యూత్ సండే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ విప్, నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా దేవాలయానికి విరాళంగా అందించిన మ్యూజిక్ మిక్సర్ సిస్టమ్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ... కులమతాలకు అతీతంగా ప్రభువు చూపిన ప్రేమ, సోదరభావం, సేవా మార్గంలో ప్రతి ఒక్కరూ తమ పొరుగువారిని ప్రేమిస్తూ ఐకమత్యంతో జీవించాలని పిలుపునిచ్చారు. తనపై ప్రేమాభిమానాలు చూపుతున్న సంఘ పెద్దలు, సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. యూత్ సండేను ఘనంగా నిర్వహించిన యువతకు ప్రత్యేక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు.



# గణపతికి భక్తి.. ప్రకృతికి రక్షణ!

**పీఓపీ, రసాయనిక రంగుల విగ్రహాలతో జలవనరులకు ముప్పు..**

**మట్టి విగ్రహాలనే పూజించాలని కలెక్టర్ సూచన**

**కాకినాడ, సెప్టెంబర్ 13 ( ప్రజా వీక్షణం విలేఖరి):**



పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ) విగ్రహాలకు బదులుగా సహజసిద్ధమైన మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరింధిర ప్రసాద్ జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ నెల 14న వినాయక చవితిని పురస్కరించుకుని భక్తి, ఆధ్యాత్మికతతో పాటు పర్యావరణ బాధ్యతను పాటిస్తూ వేడుకలను నిర్వహించాలని కోరారు. “మట్టి వినాయకుడిని పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం” అనే సందేశంతో ప్రతి ఒక్కరూ పర్యావరణహిత వినాయక చవితి వేడుకల్లో భాగస్వాములు కావాలని కలెక్టర్ సూచించారు. పీఓపీ విగ్రహాలు, రసాయ నిక రంగుల వినియోగం వల్ల నిమజ్జనం అనంతరం చెరువులు, కాలువలు, ఇతర జలవనరులపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. మట్టి విగ్రహాలను పూజించి సహజసిద్ధమైన పద్ధతుల్లో నిమజ్జనం చేయడం ద్వారా నీటి వనరులను కాలుష్యం నుంచి కాపాడటంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. పండుగల సమయంలో సంప్రదాయాలను పాటిస్తూనే ప్రకృతి పరిరక్షణను బాధ్యతగా స్వీకరించాలని కలెక్టర్ తెలిపారు. వినాయక చవితి సందర్భంగా జిల్లా ప్రజలందరికీ కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు.

# రూ. 270 కోట్లతో రామచంద్రపురం నియోజకవర్గ అభివృద్ధి!

**ఒక్కరోజే రూ .22.25 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన మంత్రి వాసంశెట్టి సుభాష్!**

**రామచంద్రపురం నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు!**

**కాజులూరు మండలంలో పలు గ్రామాల్లో రోడ్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన!**

**కాజులూరు, సెప్టెంబర్ 13 ( ప్రజా వీక్షణం విలేకరి):**

రామచంద్రపురం నియోజవర్గాన్ని 270 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ వెల్లడించారు. రామచంద్రపురం నియోజకవర్గం కాజులూరు మండల పరిధిలో రూ.22.25 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ఆదివారం శంకుస్థాపనలు చేశారు. గ్రామీణ రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో ఇప్పటివరకు రూ.270 కోట్లతో అభివృద్ధి చేశామని, మరింత వేగవంతం చేస్తూ ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని హామీ ఇచ్చారు. గత ఐదేళ్ల జగన్ రెడ్డి పాలనలో రాష్ట్రం ఆర్థికంగా నష్టపోవడంతో పాటు, రోడ్లన్నీ గుంతల మయంగా తయారయ్యాయని విమర్శించారు. ప్రజల మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుంది అన్నారు.

**రూ.150 కోట్లతో 104 రోడ్ల నిర్మాణం!**

ప్రజల మౌలిక సదుపాయాలు కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తూ కూటమి ప్రభుత్వం 104 రోడ్ల నిర్మాణానికి గాను రూ.150 కోట్లు మంజూరు చేసామని మంత్రి వెల్లడించారు. వీటిలో కాజులూరు మండలంలో 9 రోడ్లు రూ.16 కోట్లతో నిర్మిస్తున్నామన్నారు. ఏసిఆర్ ప్రాజెక్ట్స్- రాణా ప్రతాప్ ఆధ్వర్యంలోచేపట్టిన ఈ రోడ్ల నిర్మాణం త్వరిత గతిన, నాణ్యతతో పూర్తిచేస్తారని మంత్రి సుభాష్ వెల్లడించారు.

**శంకుస్థాపన చేసిన రోడ్లు ఇవే!**

తుమ్మనపల్లి నుండి ముతుకుమిల్లి రోడ్డు ( వయా ఆర్యవటం , బందనపూడి) - రూ.2.51 కోట్లు. ఆర్యవటం నుండి జగన్నాథగిరి రోడ్డు (వయా తర్లంపూడి, టీ. మామిడాడ ) - రూ.2.61 కోట్లు. అంద్రంగి నుండి యానాం ద్రాక్షారామం రోడ్డు - రూ.4.90 కోట్లు. గొప్పిరేవు నుండి పల్లిపాలెం రోడ్డు (వయా నామవానిపాలెం) రూ.1.78 కోట్లు. యానాం - ద్రాక్షారామం ప్రధాన రోడ్డు నుండి పొలమరుపాడు రోడ్డు - రూ.0.47 కోట్లు.కోలంక నుండి పెద్దలంక రోడ్డు - రూ.0.49 కోట్లు. కోలంక నుండి చలివేంద్రపాడు రోడ్డు -- రూ.1.14 కోట్లు. కోలంక నుండి నామవారిపాలెం రోడ్డు -- రూ.1.39 కోట్లు. పల్లిపాలెం నుండి ఎర్రగుంటపేట రోడ్డు -- రూ.0.68 కోట్లు. మంత్రి వాసంశెట్టి సుభాష్ పర్యటన సందర్భంగా సంబంధిత శాఖ అధికారులు పనుల వివరాలను వివరించారు. కార్యక్రమంలో కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, కాజులూరు మండల టిడిపి అధ్యక్షులు చవ్వాకుల నారాయణమూర్తి, మండల జనసేన అధ్యక్షులు బొండా వెంకన్న, ఏసీఆర్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాసరావు, కూటమి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సీపీఎల్‌కు యానాం యువకుడు ఎంపిక

**యానాం, సెప్టెంబర్ 13 ( ప్రజా వీక్షణం విలేఖరి):**

అమెరికాలో నిర్వహించే కరోలినా ప్రీమియర్ లీగ్ (సీపీఎల్)కు యానాంకు చెందిన యువ క్రికెటర్ మంగా సత్యసుమంత్ ఎంపికయ్యారు. ఆదివారం నిర్వహించిన క్రికెటర్ల వేలంలో సత్యసుమంత్‌ను 10 వేల డాలర్లకు క్వీన్ సిటీ లేకర్స్ జట్టు దక్కించుకుంది.ఈ టోర్నీలో కరోలినా హాక్స్, చార్లెట్ సైలియన్స్, క్వీన్ సిటీ లేకర్స్, కరోలినా కింగ్స్, ఎస్సీ యునైటెడ్, కరోలినా సూపర్‌స్టార్స్, కరోలినా టైగర్స్, చార్లెట్ లయన్స్ తదితర జట్లు పోటీపడుతున్నాయి .గతంలో సత్యసుమంత్ పుదుచ్చేరి బైజూస్ టీ20 జట్టుకు ప్రాతినిధ్యం వహించడంతో పాటు హైదరాబాద్‌లో నిర్వహించిన పలు టోర్నీల్లో పాల్గొని విశేష ప్రతిభ కనబరిచారు. సీపీఎల్‌కు ఎంపికైన సత్యసుమంత్‌ను పలువురు అభినందించారు.

ప్రజావీక్షణం
దినపత్రిక

# కూటమి క్లీన్‌స్వీప్ లక్ష్యంగా కదలాలి!

స్థానిక ఎన్నికల్లో ప్రతి స్థానంలోనూ విజయం సాధించాలి..

విభేదాలకు తావివ్వొద్దు

కాకినాడలో టీడీపీ--జనసేన--బీజేపీ సమన్వయ సమావేశంలో

ఇన్‌చార్జి మంత్రి పొంగూరు నారాయణ దిశానిర్దేశం

**కాకినాడ, సెప్టెంబర్ 13 ( ప్రజా వీక్షణం విలేఖరి):**

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాకినాడ జిల్లాలో కూటమి జెండా ఎగరేయడమే లక్ష్యంగా మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ పిలుపునిచ్చారు. జిల్లాలోని అన్ని స్థానాల్లోనూ కూటమి అభ్యర్థుల విజయమే ధ్యేయంగా క్షేత్రస్థాయి నుంచి ఎన్నికల సన్నద్ధత చేపట్టాలని సూచించారు. కాకినాడలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతల సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్, ఎన్నికల ఇన్‌చార్జి సుజయ్ కృష్ణ రంగారావుతో పాటు కూటమి ముఖ్య నాయకులు పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధత, క్షేత్రస్థాయి పరిస్థితులు, సీట్ల కేటాయింపు, మూడు పార్టీల మధ్య సమన్వయంపై విస్తృతంగా చర్చించారు. మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు వ్యక్తిగత విభేదాలను పక్కనపెట్టి ఐక్యంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. క్షేత్రస్థాయిలో చిన్నపాటి సమస్యలు, అభిప్రాయ భేదాలు తలెత్తినా వాటిని పెద్దవిగా మార్చకుండా జిల్లా సమన్వయ కమిటీ దృష్టికి తీసుకువచ్చి తక్షణమే పరిష్కరించుకోవాలని మంత్రి నారాయణ సూచించారు. కూటమి ప్రభుత్వానికి ప్రజల్లో ఉన్న మద్దతును ఎన్నికల ఫలితాల్లో ప్రతిబింబించేలా నాయకులు సమష్టిగా పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. ప్రతిపక్షాలకు అవకాశం లేకుండా జిల్లాలో కూటమి క్లీన్‌స్వీప్ సాధించడమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ఎన్డీయే జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయ కమిటీ సభ్యులు, జనసేన తరపున మేడిశెట్టి సూర్యకిరణ్ (కత్తిపూడి బాబీ), బుర్రా దివ్యరాజ్, మల్లాది రాజేంద్రప్రసాద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాలగ్రామ లక్ష్మీ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



# సోమవారం పి.జి.ఆర్.ఎస్ రద్దు!

**అమలాపురం, సెప్టెంబర్ 13**

**( ప్రజా వీక్షణం విలేకరి):**



నేడు అనగా సెప్టెంబర్ 14 సోమవారం వినాయక చవితి సందర్భంగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు చేస్తున్నట్లు జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ వై. ఖోమ్. నైడియా దేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, ఉద్యోగస్తులకు స్వచ్ఛంద సంస్థలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశరు.

# శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు!

శాంతియుతంగా వినాయక వేడుకలు జరపాలి....పోలీసులు!

**కాట్రేనికోన, సెప్టెంబర్ 13 ( ప్రజా వీక్షణం విలేకరి):**

వినాయక చవితి వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో, మతసామరస్యానికి భంగం వాటిల్ల కుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని ముమ్మిడివరం సి.ఐ. మోహన్ కుమార్, కాట్రేనికొన తహసీల్దార్ వి. రవి కిరణ్, ఎస్.ఐ. వి. సత్యనారాయణ ఉమ్మడిగా పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఐపీఎస్ ఆదేశాల మేరకు, అమలాపురం డీఎస్పీ టీ.ఎస్.ఆర్.కె ప్రసాద్ పర్యవేక్షణలో కాట్రేనికోన పరిధిలోని ఉత్సవ కమిటీ సభ్యులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో వారు పలు కీలక సూచనలు చేశారు. విగ్రహాల ఏర్పాటుకు ముందే పోలీస్, మున్సిపల్, విద్యుత్, అగ్నిమాపక, మరియు ట్రాఫిక్ శాఖల నుండి ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా ముందస్తు అనుమతులు తప్పనిసరిగా పొందాలని, నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఉత్సవ పండళ్ల వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ప్రమాదాలు జరగకుండా నాణ్యమైన వైరింగ్ ఏర్పాటు చేయాలని, ఊరేగింపుల సమయంలో మైక్ సెట్ల శబ్ద తీవ్రతపై సుప్రీంకోర్టు నిబంధనలు పాటించాలని సూచించారు. అంతేకాకుండా, ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా నిర్దేశించిన మార్గాలు, సమయపాలన పాటిస్తూ, కేటాయించిన పాయింట్ల వద్దే నిమజ్జనం పూర్తి చేయాలన్నారు. ఉత్సవ కమిటీలు స్వచ్ఛందంగా వ్యవహరిస్తూ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు మరియు స్థానిక యంత్రాంగానికి పూర్తిస్థాయిలో సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.



# ఇంటింటా సమస్యలు.. అధికారుల తీరుపై అసంతృప్తి

45 రోజుల 'ఇంటింటికీ తెలుగుదేశం' ముగింపు సందర్భంగా పిల్లి దంపతుల వ్యాఖ్యలు

తాగునీటి విషయంలో అధికారుల అలసత్వం.. ఎమ్మెల్యేను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపణ

పింఛన్లు, ఇళ్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని వెల్లడి

**కాకినాడ రూరల్, సెప్టెంబర్ 13**

**( ప్రజా వీక్షణం విలేఖరి)**

: నియోజకవర్గంలోని గ్రామాలు, డివిజన్లలో 45 రోజులపాటు నిర్వహించిన 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన సమస్యల పై టీడీపీ కాకినాడ రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి దంపతులు స్పందించారు. వాకలపూడి మహాలక్ష్మినగర్‌లోని తమ నివాసంలో ఆదివారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో కార్యక్రమం వివరాలను వెల్లడించారు. 45 రోజులపాటు ప్రతి గ్రామం, డివిజన్‌లో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని వారి అభిప్రాయాలు, సమస్యలను తెలుసుకున్నామని పిల్లి దంపతులు తెలిపారు. ప్రధానంగా తాగునీరు, పింఛన్లు, ఇళ్ల సమస్యలు ఎక్కువగా తమ దృష్టికి వచ్చాయని చెప్పారు. పరిష్కరించగలిగిన సమస్యల పై తక్షణమే కృషి చేశామని, మిగిలిన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి ప్రయత్నిస్తామని పేర్కొన్నారు. తాగునీటి సమస్యపై పిల్లి దంపతులు అధికారుల తీరును తీవ్రంగా తప్పుబట్టారు. అధికారుల అలసత్వం కారణంగానే ప్రజలకు సక్రమంగా తాగునీరు అందడం లేదని ఆరోపించారు. సమస్యను స్థానిక ఎమ్మెల్యే పంతం నానాజీ దృష్టికి తీసుకెళ్లకుండా అధికారులు ఆయనను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. నగరంలోని డివిజన్లకు నీరు అందుతున్నప్పుడు కాకినాడ రూరల్ నియోజకవర్గంలోని గ్రామాలకు తాగునీరు ఎందుకు అందడం లేదో అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తాము ఎమ్మెల్యేలుగా ఉన్న సమయంలో సూర్యారావుపేట, తూరంగి, వేళంగి, కరప, ఎస్.అచ్చుతాపురం ప్రాంతాల్లో ఐదు వాటర్ స్కీమ్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. రూ.100 కోట్లకు పైగా నిధులతో ట్యాంకులు నిర్మించి, ఎన్టీఆర్ సుజల పథకం ద్వారా గ్రామాలకు తాగునీటిని అందించామని గుర్తుచేశారు. ప్రస్తుతం వాటిని సక్రమంగా నిర్వహించకపోవడంతో గోదావరి జలాలు కలుషితమై తాగేందుకు అనువుగా లేకుండా పోతున్నాయని అన్నారు. పింఛన్ల విషయంలో ప్రభుత్వం ఇప్పటికే స్పష్టత ఇచ్చిందని పిల్లి దంపతులు తెలిపారు. వచ్చే నెల 1వ తేదీన నూతన పింఛన్లు విడుదల కానున్నాయని చెప్పారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్ అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. అదే విధంగా ఇళ్ల కోసం హౌసింగ్ స్కీమ్ మంజూరు చేయాలని పలువురు కోరారని, అర్హులైన కుటుంబాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. 45 రోజుల కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అభిప్రాయాలు, సమస్యలను క్రోడీకరించి అవసరమైన అంశాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లనున్నట్లు పిల్లి దంపతులు వెల్లడించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించుకునేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేస్తారని స్పష్టం చేశారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు దొమ్మేటి వెంకట రమణ, ఇట్టా చిన వెంకటేశ్, సీనియర్ నాయకులు కాళ్ల శ్రీనివాస్, ఏడుకొండలు, పెంకె వీరబాబు, మేడిశెట్టి బుజ్జి, పలివెల గాయత్రి, రామారావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



# ఎల్ నినో పేరుతో రైతుల నోట్లో మట్టి!

పంటలకు నీరివ్వకుండా చంద్రబాబు రాజకీయం.. రైతుల రుణాలు రీషెడ్యూల్ చేయాలి: వైసీపీ జిల్లా అధ్యక్షుడు రాజా

ఉద్యోగులను భయపెట్టి డబ్బులు వసూలు చేశారంటూ దవులూరి దొరబాబు ఆరోపణ

**కాకినాడ, సెప్టెంబర్ 13 ( ప్రజా వీక్షణం విలేఖరి):**

ఎల్ నినో ప్రభావం పేరుతో ముఖ్యమంత్రి చంద్రబాబు రైతుల నోట్లో మట్టి కొడుతూ తీవ్ర నష్టానికి గురిచేస్తున్నారని వైసీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రామలింగేశ్వరరావు (రాజా) ఆరోపించారు. ఇదే తరహా వాతావరణ పరిస్థితులు పక్క రాష్ట్రం తెలంగాణలో ఉన్నప్పటికీ అక్కడ 93 శాతం భూములు సాగులో ఉన్నాయని, రాష్ట్రంలో మాత్రం రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. పంటలకు నీరందించే అంశంపై దృష్టి పెట్టకుండా ప్రభుత్వం రాజకీయాలకు ప్రాధాన్యం ఇస్తోందని మండిపడ్డారు. ఆదివారం కాకినాడలోని జిల్లా వైసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాజా మాట్లాడారు. రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నందున వారి రుణాలను తక్షణమే రీషెడ్యూల్ చేసి, కొత్త రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో సుమారు రూ.2.25 కోట్ల అవినీతి జరిగిందన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. ఉద్యోగులకు ఏప్రిల్ 1న జీతాలు పెంచి, జూలై 1న తిరిగి ఆ మొత్తాన్ని తీసుకున్నారని ఆరోపించారు. పిఠాపురం నియోజకవర్గంలోని గొల్లప్రోలు మండలం కొడవలి కొండపై మైనింగ్ నిర్వహిస్తున్నారని, దీనిని నిలిపివేయాలని నేపాల్, శ్రీలంకకు చెందిన బౌద్ధులు నిరసన తెలిపినట్లు రాజా పేర్కొన్నారు. ఈ వ్యవహారం అంతర్జాతీయ స్థాయిలో జిల్లా ప్రతిష్ఠను దెబ్బతీస్తోందని అన్నారు. పిఠాపురంలో కాకినాడ అభివృద్ధి ఆధారిత సంస్థ (కౌడ) నిధుల దుర్వినియోగం జరుగుతోందని, ఎలాంటి అనుమతులు లేకుండా రూ.5 లక్షల లోపు పనులు చేపట్టినట్లు చూపిస్తూ బిల్లులు పొందుతున్నారని ఆరోపించారు.




డీసీసీబీ, కౌడ వ్యవహారాలు, కొడవలి మైనింగ్‌పై ఆరోపణలు వస్తున్నప్పటికీ జిల్లాకు చెందిన మంత్రి పవన్ కళ్యాణ్ స్పందించకపోవడం దారుణమని రాజా అన్నారు. ఈ అక్రమాల గురించి మంత్రికి తెలుసా? తెలిస్తే ఎందుకు మౌనం వహిస్తున్నారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఆయా వ్యవహారాల వెనుక ఎవరున్నారో తేల్చేందుకు సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. పెద్దాపురం వైసీపీ ఇన్‌చార్జి దవులూరి దొరబాబు మాట్లాడుతూ డీసీసీబీ ఉద్యోగులను భయపెట్టి జీతాలు పెంచి రూ.2.50 కోట్లు కాజేశారని ఆరోపించారు. డీసీసీబీ అధ్యక్షుడు తుమ్మల బాబుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పదోన్నతులు కల్పిస్తామని చెప్పి ఉద్యోగుల నుంచి భారీగా నగదు వసూలు చేశారని ఆరోపించారు. జూలై 1న అనపర్తి, రఘుదేవపురం, మురముళ్ల, ప్రత్తిపాడు డీసీసీబీ బ్రాంచ్‌ల నుంచి అధ్యక్షుడికి నగదు రూపంలో డబ్బులు అందించారని పేర్కొన్నారు. తమ ఆరోపణలు అవాస్తవమైతే జూలై 1వ తేదీకి సంబంధించిన సీసీటీవీ ఫుటేజీలను బహిర్గతం చేయాలని దవులూరి సవాల్ చేశారు. డీసీసీబీ, కౌడ నిధుల వ్యవహారాలు, కొడవలి మైనింగ్‌కు సంబంధించి తమ వద్ద పూర్తి ఆధారాలు ఉన్నాయని తెలిపారు. ఈ వ్యవహారాలపై ప్రభుత్వం తక్షణమే విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వైసీపీ నాయకులు వర్ధినీడి సుజాత, జమ్మలమడక నాగమణి, రావూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడకు భారీ అభివృద్ధి ప్రణాళిక!

తాగునీరు, రహదారులు, గ్రీనరీ, యూజీడీకి ప్రాధాన్యం..

రూ.354 కోట్ల తాగునీటి ప్రాజెక్టు వేగవంతం

రోడ్లకు రూ.39 కోట్లు..

పార్కులు, గ్రీనరీకి రూ.25 కోట్లు.. యూజీడీకి రూ.250 కోట్ల వరకు సమీకరణ

**కాకినాడ, సెప్టెంబర్ 13 ( ప్రజా వీక్షణం విలేఖరి):**

భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని కాకినాడ నగరాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు భారీ ప్రాజెక్టులతో కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జి మంత్రి, మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నగరంలో తాగునీరు, రహదారులు, పారిశుధ్యం, గ్రీనరీ, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వంటి మౌలిక వసతులకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడించారు. ఆదివారం కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ వార్షిక అభివృద్ధి, ప్రాజెక్టులపై జిల్లా కలెక్టర్, కమిషనర్, ఎమ్మెల్యేలు, వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో మంత్రి మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని మంత్రి స్పష్టం చేశారు. కాకినాడలో రూ.354 కోట్లతో చేపట్టిన తాగునీటి ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. నీటి కేటాయింపులకు సంబంధించిన జీవో త్వరలో వెలువడనున్న నేపథ్యంలో ప్రాజెక్టు పనుల్లో మరింత పురోగతి సాధించేలా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో ఏర్పాటు చేస్తున్న వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ ద్వారా పరిసర మున్సిపాలిటీలు, పంచాయతీల నుంచి సేకరించే ఘన వ్యర్థాలను శుద్ధి చేసి విద్యుత్ ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపారు. ప్లాంట్‌కు అవసరమైన నీటి సరఫరా సమస్యను కూడా త్వరగా పరిష్కరిస్తామని చెప్పారు. నగర పారిశుధ్యాన్ని మెరుగుపరచాలంటే రహదారులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. ఇందుకోసం రూ.39 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. బ్యాలెన్స్ రోడ్లతోపాటు కచ్చా, గ్రావెల్ రోడ్లను అభివృద్ధి చేయడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో సెంట్రల్ డివైడర్లు ఏర్పాటు చేస్తామన్నారు. స్వీపింగ్ యంత్రాలు సమర్థంగా పనిచేయాలన్నా రోడ్లు పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందాల్సిందేనని స్పష్టం చేశారు. రాష్ట్రంలో గ్రీన్ ఏరియాను 50 శాతానికి పెంచాలన్న లక్ష్యానికి అనుగుణంగా కాకినాడలో పార్కులు, గ్రీనరీ అభివృద్ధికి రూ.25 కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఇప్పటికే టెండర్లు పిలిచామని, త్వరలో ప్రక్రియ పూర్తి చేసి ఏడాదిన్నర నుంచి రెండేళ్లలో పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నగర పారిశుధ్య సమస్యలకు శాశ్వత పరిష్కారం అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థేనని మంత్రి స్పష్టం చేశారు. ఇళ్ల నుంచి వెలువడే మురుగునీరు బహిరంగ డ్రైన్లలోకి చేరకుండా భూగర్భ పైపుల ద్వారా తరలించేలా యూజీడీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. కాకినాడ యూజీడీ ప్రాజెక్టుకు రూ.200--250 కోట్ల వరకు నిధులు సమకూర్చే అంశాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. యూఐడీఎఫ్-3, యూఐడీఎఫ్-4 తదితర పథకాల ద్వారా నిధుల సమీకరణకు అవసరమైన అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కన్సల్టెంట్‌ను నియమించి ప్రాజెక్టును త్వరగా ముందుకు తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. కాకినాడ నగరంలో ఇప్పటికే మంజూరైన నిధులు, చేపట్టిన పనులు, పెండింగ్ ప్రతిపాదనలు, భవిష్యత్ అవసరాలపై సమగ్రంగా సమీక్షించినట్లు సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు తెలిపారు. పారిశుధ్య వ్యవస్థను మరింత మెరుగుపరచడంతోపాటు అవసరమైన ప్రాంతాల్లో రహదారులు, డ్రైనేజీ వ్యవస్థలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. మురుగునీటిని శుద్ధి చేయకుండా సముద్రంలోకి వదలకుండా ఎస్టీపీలు ఏర్పాటు చేయాలని సూచించారు. గతంలో స్మార్ట్ సిటీ ప్రాజెక్టు ద్వారా చేపట్టిన పనులతోపాటు ఇంకా పూర్తికావాల్సిన పనులను వేగవంతం చేయాలని అధికారులను కోరారు.

# ఫైనల్లో టాస్ గెలిచిన భారత్.. తుదిజట్టులో యువ వికెట్‌కీపర్..!



మహిళల ఆసియా కప్ ఫైనల్‌కు వేళైంది. ఎనిమిదో టైటిల్‌పై గురి పెట్టిన టీమిండియా టైటిల్ పోరులో శ్రీలంకను ఢీకొడుతోంది. గత సీజన్‌లో లంక చేతిలో ఓడి కప్‌ను చేజార్చుకున్న హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం ఈసారి ప్రతీకార విజ యంపై కన్నేసింది. దుబాయ్ వేదికగా జరుగుతున్న మ్యాచ్‌లో టాస్ గెలిచిన హర్మన్‌ప్రీత్ బ్యాటింగ్ తీసుకుంది. ఇరుజట్లు తమ తుది జట్టులో రెండు మార్పులు చేశాయి.అజేయంగా మహిళల ఆసియా కప్ ఫైనల్‌కు దూసుకెళ్లిన భారత జట్టు రికార్డు టైటిల్ లక్ష్యంగా ఆడనుంది. రెండేళ్ల క్రితం టీమిండియాను ఓడించిన తొలిసారి ఆసియా ఛాంపియన్‌గా అవతరించిన శ్రీలంక ట్రోఫీ నిలబెట్టుకోవాలనే పట్టుదలతో ఉంది. రెండు జట్లు లీగ్ దశలో అద్భుతంగా ఆడడంతో విజేత ఎవరు? అనేది ఆసక్తి రేపుతోంది. కీలకమైన మ్యాచ్ కావడంతో ఇరుజట్లు రెండు మార్పులతో ఆడుతున్నాయి. ప్రతీకా రావల్ స్థానంలో జి.కమలిని ఎంపికవ్వగా.. విష్మీ గుణరత్నేను తీసుకుంది లంక.భారత తుది జట్టు: స్మృతి మంధాన, షఫాలీ వర్మ, జి.కమలిని, హర్మన్‌ప్రీత్ కౌర్(కెప్టెన్), భారతి ఫుల్‌మాలి, రీచా ఘోష్(వికెట్ కీపర్), దీప్తి శర్మ, ప్రేమా రావత్, శ్రీ చరణి, క్రాంతి గౌడ్, నందిని శర్మ.శ్రీలంక తుది జట్టు: చమరి ఆటపట్టు(కెప్టెన్), ఇమేష దులానీ, విష్మీ గుణరత్నే, హాసిని పెరీరా, హర్షిత సమరవిక్రమ, కవిష దిల్హారి, నీలాక్షిక సిల్వా, కౌశాని నుత్యంగన(వికెట్ కీపర్), సుగంధిక కుమారి, చముడి ప్రబోద, మిథాలీ అయోధ్య.

# 21వ అర్ధశతకం బాదేసిన షఫాలీ.. మంధాన జోరుతో లంక బౌలర్లు డీలా..!



మహిళల ఆసియా కప్ ఫైనల్లో భారత ఓపెనర్ షఫాలీ వర్మ(58 నాటౌట్) చెలరేగుతోంది. బౌండరీలతో హోరెత్తిస్తున్న షఫాలీ అర్ధ శతకంతో మెరిసింది. పవర్ ప్లేలోనే ఫిఫ్టీకి చేరువైన ఈ లేడీ సెహ్వాగ్.. 24 బంతుల్లోనే హాఫ్ సెంచరీ అందుకుంది. టీ20ల్లో షఫాలికి ఇది 21వ అర్ధ శతకం. మరో ఎండ్‌లో స్మృతి మంధాన(32 నాటౌట్) సైతం బాదేస్తుండగా భారత సో?్కర్ బోర్డు పరుగులు తీస్తోంది.మహిళల ఆసియా కప్ ఫైనల్లో భారత ఓపెనర్లు దంచేస్తున్నారు. ఎనిమిదో టైటిల్ లక్ష్యంగా పెట్టుకున్న టీమిండియాకు శుభారంభమిస్తూ.. ఇన్నింగ్స్ మొదటి బంతినే స్మృతి మంధాన(32 నాటౌట్) బౌండరీకి తరలించగా.. ఆ తర్వాత కవిశ దిల్హారి ఓవర్లో షఫాలీ వర్మ(58 నాటౌట్) రెండు ఫోర్లతో చెలరేగింది. వీరిద్దరి విధ్వంసంతో పవర్ ప్లేలోనే వికెట్ పడకుండా టీమిండియా 57 పరుగులు చేసింది.కాసేపటికే కవిశ ఓవర్లో బౌండరీతో అర్ధశతకం అందుకుంది షఫాలీ. 24 బంతుల్లోనే 8 ఫోర్లు, రెండు సిక్సర్లతో ఫిఫ్టీ సాధించింది తను. లంక బౌలర్లపై ఇద్దరూ విరుచుకుపడడంతో 9 ఓవర్లలో 91రన్స్ చేసిన భారత్ భారీ స్కోర్ దిశగా సాగుతోంది.



# అఫ్గనిస్థాన్‌తో తొలి టీ20.. వైభవ్ బెంచ్ మీదే..!

స్వదేశంలో అఫ్గనిస్థాన్‌తో మూడు టీ20ల సిరీస్ కాసేపట్లో మొదలవ్వనుంది. టాస్ గెలిచిన టీమిండియా కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ బౌలింగ్ తీసుకున్నాడు. అందరూ ఊహించినట్టే వైభవ్ సూర్యవంశీ బెంచ్‌కే పరిమితయ్యాడు. రెగ్యులర్ ఓపెనర్ సంజూ శాంసన్‌ను పక్కన పెట్టడంపై విమర్శలు వస్తున్న వేళ.. ఈసారి వైభవ్‌కు తుది జట్టులో చోటు దక్కలేదు. అఫ్గన్ టీ20 కెప్టెన్‌గా తొలి సిరీస్ ఆడుతున్న ఇబ్రహీం జద్రాన్ మాట్లాడుతూ.. భారీ లక్ష్యాన్ని నిర్దేశిస్తామని చెప్పాడు.ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలో వైట్‌వాష్‌కు గురైన భారత జట్టు స్వదేశంలో పంజా విసరాల నుకుంటోంది. వరసగా రెండు సిరీస్‌లు చేజారినందున అఫ్గనిస్థాన్‌పై క్లీన్‌స్వీప్ లక్ష్యంగా ఆడనుంది టీమిండియా. ఆదివారం తొలి టీ20ని విజయంతో మొదలెట్టాలని భావిస్తున్న శ్రేయాస్ అయ్యర్ సేన బౌలింగ్ తీసుకుంది. ఫిట్‌నెస్ నిరూపించుకున్న నితీశ్ రెడ్డి, సుందర్, బుమ్రాలు తుది జట్టులోకి రాగా.. వైభవ్ సూర్యవంశీ బెంచ్‌కే పరిమితమయ్యాడు. అఫ్గనిస్థాన్ కూడా మూడేళ్ల తర్వాత పునరాగమనం చేయాలనుకున్న నవీన్ ఉల్ హక్‌ను తీసుకోలేదు.

# జూనియర్లు జయహో.. పసిడితో గర్జించిన అబ్బాయిలు, అమ్మాయిలు..!

ఏహెచ్‌ఎఫ్ జూనియర్ ఆసియా కప్‌లో భారత్ పంజా విసిరింది. టాప్ గేర్‌లో ఆడిన టీమిండియా ఏకంగా రెండు విభాగాల్లోనూ పసిడితో మెరిసింది. ఆదివారం ఏకపక్షంగా జరిగిన ఫైనల్లో దక్షిణ కొరియాపై అబ్బాయిల జట్టు జయభేరి మోగించగా.. ఉత్కంఠ పోరులో చైనాకు చెక్ పెట్టారు అమ్మాయిలు. దాంతో.. స్వల్ప వ్యవధిలోనే పోడియం మీద మువ్వన్నెల జెండా రెండుసార్లు రెపరెపలాడింది. అంతేకాదు ఎఫ్ఐహెచ్ జూనియర్ వరల్డ్‌కప్ బెర్తును సొంతం చేసుకుంది. హాకీలో సీనియర్ జట్లు విఫలమైనా.. జూనియర్ టీమ్ మాత్రం పసిడి పతకం కొల్లగొట్టింది. ఆసియా కప్‌లో పురుషుల, మహిళల జట్లు అద్భుత విజయంతో స్వర్ణం సాధించాయి. ఆదివారం టైటిల్ పోరులో అబ్బాయిల బృందం చేతిలో దక్షిణ కొరియా కంగుతినగా.. అమ్మాయిల ధాటికి చైనా తోకముడిచింది. కొరియాతో ఫైనల్లో 4-1తో విజయం సాధించింది పురుషుల జట్టు. ఆట మొదలైన 9వ నిమిషంలోనే అజీత్ యాదవ్ గోల్ చేయగా.. అన్మోల్ ఎక్కా 13వ నిమిషంలో, ప్రభ్‌దీప్ సింగ్ గోల్‌తో తొలి అర్ధ భాగంలోనే భారత్ పైచేయి సాధించింది. రెండో అర్ధ భాగంలో కొరియా ఖాతా తెరిచినా అశూ మౌర్యలు చెరొక గోల్‌తో టీమిండియా స్పష్టమైన ఆధిక్యంతో గెలుపొందింది. తద్వారా ఎఫ్ఐహెచ్ జూనియర్ వరల్డ్‌కప్ బెర్తు పట్టేసింది. దుర్భేధ్యమైన డిఫెన్స్‌తో టైటిల్ పోరులో అమ్మాయిల జట్టు సైతం గొప్పగా ఆడి చైనాను నిలువరించింది. దుర్భేధ్యమైన డిఫెన్స్‌తో ప్రత్యర్థిని అడ్డుకున్న టీమిండియా 1-0తో గోల్డ్ మెడల్ కొల్లగొట్టింది. ఈ విజయంతో ఐదో ఎఫ్ఐహెచ్ జూనియర్ వరల్డ్‌కప్ పోటీలకు అర్హత సాధించింది టీమిండియా. సంచలన ప్రదర్శనతో ఆసియా కప్ గెలుపొందిన మహిళల జట్టుకు హాకీ ఇండియా రివార్డులు ప్రకటించింది. స్క్వాడ్‌లోని ప్లేయర్లకు రూ.3 లక్షలు, కోచింగ్ సిబ్బందికి తలా రూ.1.5 లక్షల నగదు బహుమతి ప్రకటించింది.

# మీరు ఏడుస్తారా.. మీ జీవితంలో అతి కష్టంగా గడిచిన రాత్రి ఏది?

మహిళల ఆసియా కప్ ఫైనల్‌కు మరికొన్ని గంటలే ఉంది. ఎనిమిదో టైటిల్‌పై గురి పెట్టిన టీమిండియా విజయంపై భరోసాతో ఉండగా.. మరో ధనాధన్ ఆడేందుకు సిద్ధమవుతోంది ఓపెనర్ స్మృతి మంధాన . అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక రన్స్‌తో రికార్డు నెలకొల్పిన మంధాన ఓ పాడ్‌కాస్ట్‌లో తన వ్యక్తిత్వం గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. అంతేకాదు నిరుడు అర్ధాంతరంగా పెళ్లి రద్దవ్వడం.. ఆ తదనంతర పరిణామాల నుంచి తేరుకొని ఆటపై దృష్టి సారించిన తను క్రికెట్ గురించి మాత్రమేమాట్లాడుతానని స్పష్టం చేసింది. ఆసియా కప్‌లో అదరగొడుతూ అంతర్జాతీయ క్రికెట్‌లో పరుగుల మహారాణిగా అవతరించిన స్మృతి మంధాన భావోద్వేగానికి లోనైంది. పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో 'మీ జీవితంలో అతి కష్టంగా గడిచిన రాత్రి ఏది?' అని పాడ్‌కాస్టర్ రాజ్ శమాని అడుగగా ఆమె కొన్ని క్షణాలు మౌనంగా ఉండిపోయింది. ఆ రోజును తలచుకొని.. ఉబికివస్తున్న కన్నీళ్లను దిగమింగిన మంధాన కొన్ని వరల్డ్ కప్స్ అని చెప్పింది.

# అభిషేక్, ఇషాన్ మెరుపులు..

## తొలి టీ20లో భారత్ జయభేరి..!





స్వదేశంలో అఫ్గనిస్థాన్‌తో జరుగుతున్న మూడు టీ20ల సిరీస్‌లో భారత జట్టు జయభేరి మోగించింది. ఢిల్లీ అరుణ్ జైట్లీ స్టేడియంలో అర్ష్‌దీప్ సింగ్(3-19) ధాటికి కాబూలీ బ్యాటర్లు చేతులెత్తేయగా.. స్వల్ప ఛేదనలో ఓపెనర్ అభిషేక్ శర్మ(82) అర్ధ శతకంతో విరుచుకుపడ్డాడు. అతడికి ఇషాన్ కిషన్(42) తోడవ్వగా టీమిండియా స్కోర్ పరుగులు తీసింది. ధనాధన్ ఆడిన ఈ ద్వయం ఔటయ్యాక.. కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్(8 నాటౌట్), తిలక్ వర్మ(3 నాటౌట్)లు లాంఛనం ముగించారు. ఏడు వికెట్ల విజయంతో సిరీస్‌లో బోణీ కొట్టింది భారత్.ఇటీవల వరసగా రెండు టీ20 సిరీస్‌లు కోల్పోయిన భారత జట్టు స్వదేశంలో పంజా విసిరింది. ఐర్లాండ్, ఇంగ్లండ్ చేతిలో వైట్‌వాష్‌ల నుంచి తేరుకున్న టీమిండియా మూడు టీ20ల సిరీస్ తొలి మ్యాచ్‌లో అఫ్గనిస్థాన్‌ను చిత్తు చేసింది. 157 పరుగుల ఛేదనలో శుభారంభం లభించకున్నా అభిషేక్ శర్మ(82) అర్ధ శతకంతో మెరిశాడు. సంజూ శాంసన్(82) ఔటయ్యాక ఇసాన్ కిషన్(42) జతగా అఫ్గన్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు.ఇషాన్ సైతం బ్యాట్ ఝులిపించగా లక్ష్యం కరుగుతూ వచ్చింది. జట్టు స్కోర్ 139 వద్ద అభిషేక్ ఔటైనా.. ఇషాన్ ఉతికేశాడు. అర్ధ శతకానికి చేరువైన అతడిని వెనక్కి పంపినా అప్పటికే టీమిండియా విజయం ఖాయమైంది. కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్(8 నాటౌట్), తిలక్ వర్మ(3 నాటౌట్)లు మరో వికెట్ పడకుండా చూసుకోగా 13.4 ఓవర్లోనే భారత్ గెలుపొందింది. ఒమర్జాయ్ ఒక్కడే టాస్ ఓడిన అఫ్గనిస్థాన్‌ను మొదటి ఓవర్లోనే వికెట్ తీసి బుమ్రా దెబ్బకొట్టాడు. పునరాగమనం మ్యాచ్‌లో తన తడాఖా చూపిస్తూ ఓపెనర్ రహ్మనుల్లా గుర్బాజ్(0)ను అతడు డకౌట్ చేశాడు. కాసేపటికే కెప్టన్ ఇబ్రహీం జద్రాన్(11) రనౌటయ్యాడు. ఆపై అర్ష్‌దీప్ సింగ్(3-19) విజృంభణలో కాబూలీ బ్యాటింగ్ యూనిట్ తడబడింది. ఓవైపు వికెట్లు పడుతున్నా.. అజ్మతుల్లా ఒమర్జాయ్(64), మొహమ్మద్ నబీ(33)లు బాధ్యతగా ఆడారు. వీరిద్దరి పోరాటంతో జద్రాన్ బృందం నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 156 పరుగులు చేయగలిగింది.

ప్రజావీక్షణం
దినపత్రిక



## తెలుగువారిని కట్టిపడేసేలా 'పిఠాపురంలో.. అలా మొదలైంది'.. సెప్టెంబర్ 18న గ్రాండ్ రిలీజ్!

కుటుంబ బంధాలు, తండ్రీకూతుళ్ల మధ్య ఉండే అనురాగం, నేటి తరానికి సరిపోయే సరికొత్త కథాంశంతో తెరకెక్కిన చిత్రం 'పిఠాపురంలో... అలా మొదలైంది'. ప్రముఖ దర్శకుడు మహేష్ చంద్ర దర్శకత్వం వహించిన ఈ సినిమా సెప్టెంబర్ 18న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి హైదరాబాద్‌లో చిత్ర యూనిట్ అత్యంత వైభవంగా ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ప్రముఖ నటుడు సుమన్ ముఖ్య అతిథిగా విచ్చేసి ఈ చిత్ర టీజర్‌ను ఆవిష్కరించారు. ఈ వేడుకలో టాలీవుడ్ ప్రముఖులు మాట్లాడుతూ సినిమా విజయంపై తమ నమ్మకాన్ని వ్యక్తం చేశారు. నటకిరీటి డా. రాజేంద్రప్రసాద్ తన సుదీర్ఘ సినీ ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ ఈ సినిమాపై ప్రశంసల జల్లు కురిపించారు. ప్రపంచంలోని తెలుగువారందరూ కనెక్ట్ అయ్యే అద్భుతమైన కంటెంట్ ఈ చిత్రంలో ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి ఇంట్లో జరిగే కథే ఇదని, క్లైమాక్స్ సన్నివేశాలు చూసి ఆర్టిస్టులు కూడా కన్నీళ్లు పెట్టుకున్నారంటే ఇందులో ఎంతటి బలమైన ఎమోషన్ ఉందో అర్థం చేసుకోవచ్చని తెలిపారు. కుటుంబ సమేతంగా థియేటర్లకు వెళ్లి ఈ చిత్రాన్ని ఆదరించాలని ఆయన ప్రేక్షకులను కోరారు. దర్శకుడు చంద్ర మహేష్ మాట్లాడుతూ, తాను ఈ సినిమాకు మనసుతో పాటు ప్రాణం పెట్టి పని చేశానని, ఇప్పటివరకు తాను చేసిన చిత్రాలన్నింటికంటే ఇది ఒక భిన్నమైన స్థాయిలో ఉంటుందని చెప్పారు. నిర్మాతలలో ఒకరైన ఆకుల సురేష్ మాట్లాడుతూ, తన ఊరిలో చూసిన యథార్థ సంఘటనల ఆధారంగా ఈ కథను రాసుకున్నానని, అన్ని వర్గాల ప్రేక్షకులను ఈ చిత్రం కచ్చితంగా అలరిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సుమన్, చదలవాడ శ్రీనివాసరావు, ప్రసన్న కుమార్, బివిఎస్ రవి, వీర శంకర్, సముద్ర, రాం ప్రసాద్, పృథ్వీరాజ్, కేదార్ శంకర్, మణిచందన తదితరులు పాల్గొని చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ప్రైమ్ షో ఎంటర్టైన్మెంట్ ద్వారా ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తుండగా, చిన్న సినిమాలను ఆదరించే ప్రేక్షకులకు ఇది చక్కటి అనుభూతిని పంచుతుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.



## యూత్ అండ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా ప్రణమ్ దేవరాజ్ 'శ్రీరస్తు'.. పోస్ట్ ప్రొడక్షన్ పనులు షురూ!

నటుడు ప్రణమ్ దేవరాజ్ కథానాయకుడిగా, టాలెంటెడ్ బ్యూటీ సంజనా ఆనంద్ హీరో యిన్‌గా నటిస్తోన్న తాజా చిత్రం 'శ్రీరస్తు'. హరి క్రియేషన్స్ పతాకంపై అత్యంత ప్రతిష్టా త్మకంగా తెరకెక్కుతున్న ఈ సినిమా ద్వారా శంకర్ రెడ్డి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. పెండ్లిమడుగు హరి కృష్ణ గౌడ్ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ చిత్రం తెలుగు, కన్నడ భాషల్లో ఏకకాలంలో ద్విభాషా చిత్రంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. కొత్త సినిమాలు చూడండి కుటుంబ విలువలకు పెద్దపీట వేస్తూనే, సరికొత్త యూత్ ఫుల్ కామెడీ ఎంటర్టైనర్‌గా ఈ చిత్రాన్ని మలుస్తున్నారు. ముఖ్యంగా హీరో హీరోయిన్ల మధ్య సాగే క్యూట్ లవ్ స్టోరీ, వారిద్దరి మధ్య వచ్చే సన్నివేశాలు సినిమాకే ప్రధాన హైలైట్‌గా నిలవనున్నాయి. అన్ని వర్గాల ప్రేక్షకులను, ముఖ్యంగా యువతను ఈ సినిమా కచ్చితంగా ఆకట్టుకుంటుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. ఈ చిత్రంలో మరో ప్రత్యేక ఆకర్షణగా కన్నడ స్టార్ హీరో ప్రజ్వల్ దేవరాజ్ కీలక పాత్రలో నటిస్తుండటం విశేషం. వీరితో పాటు సుమన్, దేవి ప్రసాద్, ఆమని, చైత్ర రాయ్, ప్రసాద్ బెహ్రా, రవి ప్రకాష్, రవి శివ తేజ వంటి అనుభవజ్ఞులైన ప్రముఖ నటీనటులు ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. సాంకేతిక నిపుణుల విషయానికి వస్తే, ఈ సినిమాకు టాలెంటెడ్ మ్యూజిక్ డైరెక్టర్ శేఖర్ చంద్ర అద్భుతమైన బాణీలు సమకూరుస్తున్నారు. బాల సరస్వతి సినిమాటోగ్రఫీ, శ్రీ వర్కల ఎడిటింగ్, కృష్ణ మాయ ప్రొడక్షన్ డిజైనింగ్ బాధ్యతలు సినిమా స్థాయిని మరింత పెంచుతున్నాయి. ప్రస్తుతం సినిమాకు సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే టైటిల్ మరియు ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. త్వరలోనే ఈ అల్లరితో కూడిన కుటుంబ కథా చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు ప్లాన్ చేస్తున్నారు.

## ఎన్టీఆర్ 'డ్రాగన్'లో అదిరిపోయే ఇంటర్వెల్ ఫైట్.. రెండు వారాల పాటు భారీ యాక్షన్ షూట్!

యంగ్ టైగర్ ఎన్టీఆర్, మాస్ యాక్షన్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'డ్రాగన్' సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. వీరిద్దరి కలయికలో వస్తున్న సినిమా కావడంతో మొదటి నుంచే ఈ ప్రాజెక్ట్‌పై భారీ హైప్ ఉంది. ఇప్పటివరకు సినిమా నుంచి వచ్చే ప్రతి చిన్న అప్‌డేట్ కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించి ఓ ఆసక్తికరమైన విషయం సినీ వర్గాల్లో చర్చకు వస్తోంది. సినిమాలో కీలకమైన ఇంటర్వెల్ యాక్షన్ ఎపిసోడ్‌ను భారీ స్థాయిలో చిత్రీకరించేందుకు మేకర్స్ ప్రత్యేకంగా ఓ భారీ సెట్‌ను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. కొత్త సినిమాలు చూడండి 'డ్రాగన్' సినిమాలో ఇంటర్వెల్ సీక్వెన్స్‌కు చాలా ప్రాధాన్యత ఉంటుందని టాక్ వినిపిస్తోంది. ఈ నేపథ్యంలోనే సాధారణ లొకేషన్‌లో కాకుండా ప్రత్యేకంగా భారీ సెట్‌ను నిర్మించి యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించేందుకు చిత్రబృందం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ సెట్‌లో దాదాపు రెండు వారాల పాటు వరుసగా యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ జరగనుందని సమాచారం. ముఖ్యంగా ఎన్టీఆర్‌ను మాస్ యాక్షన్ అవతార్‌లో చూపించేలా ఈ ఎపిసోడ్‌ను రూపొందిస్తున్నట్లు టాక్. ఈ భారీ యాక్షన్ బ్లాక్‌కు ప్రముఖ స్టంట్ డైరెక్టర్ పీటర్ హెయిన్ నేతృత్వం వహించనున్నట్లు తెలుస్తోంది. ఆయన పర్యవేక్షణలో ఎన్టీఆర్‌పై కీలకమైన ఫైట్స్‌ను చిత్రీకరించనున్నారని సమాచారం. ప్రశాంత్ నీల్ సినిమాల్లో యాక్షన్ సన్నివేశాలకు ప్రత్యేకమైన శైలి ఉంటుందనే విషయం తెలిసిందే. అలాంటి దర్శకుడితో ఎన్టీఆర్ వంటి పవర్‌ఫుల్ పెర్ఫార్మర్ కలవడంతో ఈ యాక్షన్ ఎపిసోడ్ ఎలా ఉండబోతుందనే ఆసక్తి అభిమానుల్లో మరింత పెరుగుతోంది. వచ్చే నెల చివరి వారంలో ఈ భారీ సెట్‌లో షూటింగ్ ప్రారంభించే అవకాశాలు ఉన్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇక ఎన్టీఆర్ ఇటీవల అనూహ్యంగా గాయపడిన విషయం తెలిసిందే. ఆ గాయానికి విజయవంతంగా శస్త్రచికిత్స పూర్తయినట్లు సమాచారం. ప్రస్తుతం తారక్ వైద్యుల సూచనల మేరకు విశ్రాంతి తీసుకుంటున్నారని తెలుస్తోంది. పూర్తిగా కోలుకున్న తర్వాతే షూటింగ్‌లో పాల్గొనే అవకాశం ఉంది. దీంతో రాబోయే షెడ్యూల్స్‌ను ఎన్టీఆర్ ఆరోగ్య పరిస్థితికి అనుగుణంగా చిత్రబృందం ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. డ్రాగన్ ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్‌ను పూర్తిగా రంగులమయంగా, వైవిధ్యమైన విజువల్ టోన్‌లో చూపించనున్నారని టాక్ వినిపిస్తోంది.



## ఫోక్ ఆర్టిస్ట్ ఈశ్వర్ సాయికి హైకోర్టులో ఊరట.. ముందస్తు బెయిల్ మంజూరు!

ప్రముఖ ఫోక్ ఆర్టిస్ట్ ఈశ్వర్ సాయికి తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. తోటి జానపద కళాకారిణి మాధురి రాథోడ్ ఫిర్యాదు మేరకు నార్సింగి పోలీస్ స్టేషన్‌లో ఆయనపై నమోదైన వివాదాస్పద కేసుకు సంబంధించి హైకోర్టు ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో న్యాయస్థానం మధ్యంతర ఉపశమనం కల్పించడంతో ఈశ్వర్ సాయికి చట్టపరంగా పెద్ద ఊరట లభించినట్టయింది. తమ మధ్య నెలకొన్న వివాదంపై నార్సింగి పోలీస్ స్టేషన్‌లో పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 69తో పాటు, ఎస్సీ, ఎస్టీ (అత్యాచార నిరోధక) చట్టం, 1989లోని సెక్షన్ 3(2)(ఙ) కింద కేసు నమోదు చేసినట్లు దర్యాప్తు పత్రాల్లో పేర్కొన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో అరెస్ట్ నుంచి రక్షణ కోరుతూ ఈశ్వర్ సాయి క్రిమినల్ పిటిషన్ నంబర్ 14088/2026 ద్వారా తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై హైకోర్టులో జరిగిన విచారణ సందర్భంగా నిందితుడి తరపున నాగూర్‌బాబు లా ఫర్మ్ న్యాయవాదులు అత్యంత బలమైన వాదనలు వినిపించారు. ఫిర్యాదుదారురాలికి, ఈశ్వర్ సాయికి మధ్య గతంలో ఉన్న సంబంధం పూర్తిగా పరస్పర అంగీకారంతో, ఎలాంటి బలవంతం లేకుండా స్వచ్ఛందంగా చాలాకాలం పాటు కొనసాగిందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. కేవలం వ్యక్తిగత కారణాల వల్ల తలెత్తిన మనస్పర్థల కారణంగానే ఈ ఫిర్యాదు దాఖలైందని, ఈ కేసుకు సంబంధించి కస్టడీ విచారణ జరపాల్సిన అవసరం ఎంతమాత్రం లేదని న్యాయవాదులు వాదించారు. అంతేకాకుండా, దర్యాప్తు అధికారులకు ఈశ్వర్ సాయి పూర్తిగా సహకరించేందుకు సిద్ధంగా ఉన్నారని, చట్టాన్ని గౌరవిస్తారని స్పష్టం చేశారు. ఈ కేసుకు సంబంధించి మోపబడిన ఆరోపణలు, వాటికి వర్తింపజేసిన చట్టపరమైన సెక్షన్ల ప్రామాణికతను భవిష్యత్తులో సేకరించే ఆధారాల ఆధారంగానే పరిశీలించాల్సి ఉంటుందని వాదించారు. ఇరుపక్షాల వాదనలను శ్రద్ధగా విన్న తెలంగాణ హైకోర్టు, కేసులోని సమగ్రాంశాలను, వాస్తవ పరిస్థితులను బేరీజు వేసుకుంటూ ఈశ్వర్ సాయికి ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కోర్టు విధించిన నిబంధనలు, షరతులకు లోబడి ఆయనను అరెస్ట్ చేయకుండా తక్షణ రక్షణ కల్పించింది. అదే సమయంలో, ఈ బెయిల్ మంజూరు కేవలం మధ్యంతర ఉపశమనం మాత్రమేనని, దీనిని ఆరోపణల నుంచి పూర్తిగా క్లీన్ చిట్‌గా భావించలేమని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ కేసు దర్యాప్తు మాత్రం చట్ట ప్రకారం నిబంధనల ప్రకారమే నిరంతరం కొనసాగుతుందని, దర్యాప్తులో వెలువడే నిజాల ఆధారంగా తదుపరి న్యాయ ప్రక్రియ ఉంటుందని తేల్చిచెప్పింది. రాష్ట్రంలో మంచి గుర్తింపు ఉన్న ఇద్దరు ప్రముఖ జానపద కళాకారులు ఈ వివాదంలో ఉండటంతో పాటు, చట్టపరమైన సెక్షన్లు తీవ్రమైనవి కావడంతో ఈ ఉదంతం తెలుగు రాష్ట్రాల కళా లోకంలోనూ, ప్రజల్లోనూ తీవ్ర చర్చనీయాంశంగా, అత్యంత ఆసక్తికరంగా మారింది.

## వారణాసి చేస్తూనే మరో 9 సినిమాలు.. పృథ్వీరాజ్ సుకుమారన్ కమిట్‌మెంట్‌కు ఔరా అనాల్సిందే..!

టాలీవుడ్ స్టార్ యాక్టర్ మహేశ్ బాబు అభిమాను లతో పాటు వరల్డ్‌వైడ్‌గా ఉన్న ఎస్ఎస్ రాజమౌళి ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్న మోస్ట్ అవెయిటెడ్ ప్రాజెక్ట్ వారణాసి. ఈ మూవీలో బాలీవుడ్ బ్యూటీ ప్రియాంకా చోప్రా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. మాలీవుడ్ స్టార్ యాక్టర్ పృథ్వీరాజ్ సుకుమారన్, మాధవన్, ప్రకాశ్ రాజ్ కీలకపాత్రల్లో నటిస్తున్నారు. మైథాలజీ, సైన్స్ ఫిక్షన్ జోనర్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తోన్న ఈ మూవీ షూటింగ్ దశలో ఉంది. ఈ చిత్రానికి సంబంధించిన ఆసక్తికర వార్త ఒకటి మూవీ లవర్స్‌ను ఎక్జయిటింగ్‌కు లోను చేస్తోంది. ఇందులో మాలీవుడ్ స్టార్ యాక్టర్ కమ్ డైరెక్టర్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీ రోల్ చేస్తున్నాడని తెలిసిందే. వారణాసిలో ఈ మల్టీ టాలెంటెడ్ యాక్టర్ రోల్‌కు సంబంధించిన చిత్రీకరణ పూర్తయింది. సాధారణంగా ఎవరైనా లీడ్ యాక్టర్ జక్కన్న సినిమాకు సైన్ చేశాడంటే.. అది పూర్తయ్యే వరకు మరో సినిమా చేసే చాన్స్ ఉండదు.. కానీ ఆసక్తికర విషయమేంటంటే పృథ్వీరాజ్ సుకుమారన్ జక్కన్న రూల్‌ను బ్రేక్ చేసి ఏకంగా వారణాసి ప్రీ ప్రొడక్షన్ పనులు మొదలయినప్పటి నుంచి ఇప్పటివరకు 9 సినిమాలు పూర్తి చేయడం టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది. కొత్త సినిమాలు చూడండిఓ వైపు వారణాసిని బ్యాలెన్స్ చేస్తూ.. మరోవైపు పృథ్వీరాజ్ సుకుమారన్ యాక్టర్ కమ్ డైరెక్టర్‌గా 9 సినిమాలు చేయడం చాలా అరుదైన విషయమని చెప్పాల్సిందే. జక్కన్న టీం ఫైనల్ టచ్ ఇచ్చే పనుల్లో బిజీగా ఉందని సమాచారం. 3 వారాల ప్యాచ్ వర్క్‌తో మొత్తం షూటింగ్ పూర్తి కానుందట. ఈ క్రమంలో జక్కన్న టీం మూవీ లవర్స్‌కు థ్రిల్ అందించే అప్‌డేట్స్, ప్రమోషనల్ కంటెంట్ కూడా రెడీ చేస్తుందని ఇన్‌సైడ్ టాక్. ఈ చిత్రాన్ని శ్రీ దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కేఎల్ నారాయణ, ఎస్–ఎస్ కార్తికేయ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీకి ఎంఎం కీరవాణి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రం రెండు పార్టులుగా రాబోతుంది. ఈ మూవీ ఫస్ట్ పార్ట్‌ను 2027 ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్టు ఇప్పటికే ప్రకటించింది టీం. సెకండ్ పార్ట్ 2029లో వస్తుందని వార్తలు రాగా.. రాజమౌళి టీం రాబోయే రోజుల్లో ఏదైనా క్లారిటీ ఇస్తుందేమో చూడాలి.




Printed & published owned by K.SRAVAN KUMAR. Printed Published RK PRINTING PRESS at 6-1-948 Boyawada Street Nalgonda.Pin : 508001. Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. RNI.NO.APTEL/2009/29433.(CELL ) 9866330400 prajaveekshanam@gmail.com